# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | గురువారం 17-10-2019 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :26 | సంచిక: 69 | పేజీలు 4 | వెల: రూ.1/-


## కేసీఆర్ ఫాంహౌస్‌లో కానిస్టేబుల్ ఆత్మహత్య

**- ఘటనపై విచారణకు ఆదేశం**

సిద్ధిపేట, అక్టోబర్16(ఆర్ఎన్ఎ) : సిద్ధిపేట జిల్లా ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ ఫాంహౌస్ లో కలకలం చెలరేగింది. హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం చేశాడు. తుపాకీతో కాల్చుకున్నాడు. గాయపడిన కానిస్టేబుల్ ను సహచరులు వెంటనే హైదరాబాద్ లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కానిస్టేబుల్ చనిపోయాడు. కానిస్టేబుల్ ని వెంకటేశ్వర్లుగా గుర్తించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కాగా ఉన్నతాధికారుల వేధింపులే సూసైడ్ కి కారణం అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌లో ఈ ఘటన జరగడం సంచలనంగా మారింది. కానిస్టేబుల్ తీరుతో పోలీసు ఉన్నతాధికారులు ఖంగుతిన్నారు. దీనిపై విచారణకు ఆదేశించారు. అసలేం జరిగిందో వెంటనే వివరణ ఇవ్వాలని చెప్పారు. కానిస్టేబుల్ ఆత్మహత్యపై సిద్దిపేట సీపీ స్పందించారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు మద్యం మత్తులో ఉన్నాడని తెలిపారు. కొంతకాలంగా విధులకు సరిగా హాజరుకావడం లేదన్నారు. భార్య విజ్ఞప్తితో తిరిగికి విధుల్లోకి తీసుకున్నామని వెల్లడించారు. వెంకటేశ్వర్లు నల్లగొండ జిల్లా వలిగొండ మండలం చాడ వాసి అని సీపీ తెలిపారు.

# ప్రభుత్వం చర్చలకు పిలిస్తే వెళ్తాం

- కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆహ్వానం లేదు
- ఆర్టీసీని కాపాడుకొనేందుకు సమ్మె సాగుతుంది
- సమ్మెతో ఉత్పన్నమయ్యే ఎలాంటి పరిణామాలకైనా ప్రభుత్వానిదే బాధ్యత

**- ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి**

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ప్రజల మద్దతు ఆర్టీసీ కార్మికులకు ఉందని టీఎస్‌ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామరెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.. తమ సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం నుంచి చర్చలకు ఎలాంటి ఆహ్వానం తమకు అందలేదని, ఒకవేళ చర్చలకు ఆహ్వానిస్తే తాము వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని అశ్వత్థామరెడ్డి అన్నారు. తాము సమస్యను పెద్దదిగా చేయాలని చూడటం లేదని, కానీ ప్రభుత్వం మాత్రం తమ ఆందోళనను పట్టించుకోనట్లుగా వ్యవహరించటం సరికాదన్నారు. ప్రజా రావాణాను కాపాడుకునేందుకు ఆర్టీసీ సమ్మె కొనసాగుతుందని అన్నారు. సమ్మెతో ఉత్పన్నమయ్యే ఎలాంటి పరిణామాలకైనా ప్రభుత్వానిదే బాధ్యత అని తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను కాపాడటానికి పోరాటం జరుగుతుందన్నారు. ప్రజలతో మమేకమై ఉన్న ఆర్టీసీని ప్రైవేట్ పరంతో విడదీసి, ఆస్తులు కూలగొట్టే ప్రయత్నాలను అడ్డుకునే పోరాటమన్నారు. ఈ పోరాటంలో ఆర్టీసీ కార్మికులతో పాటు తెలంగాణ పౌర సమాజం మొత్తం తమ వెన్నంటే ఉంటూ ప్రత్యక్షంగా పాల్గొంటుందని తెలిపారు. మంగళవారం ఉద్యోగ సంఘాల జేఏసీ తమకు మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. ఊహించని విధంగా అన్ని వర్గాల నుంచి సమ్మెకు మద్దతు లభిస్తుందని చెప్పారు. ఈ పోరాటంలో కులమతాలకతీతంగా ప్రజలు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను ఆలోచన చేసి గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీకి రావాల్సిన ప్రభుత్వ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. జీతాలు విడుదల చేయాలని అశ్వత్థామరెడ్డి డిమాండ్ చేశారు. సమ్మె విరమణకు పరిష్కార మార్గాలను కనుగొనాలని ప్రభుత్వానికి సూచించారు. చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామని తెలిపారు. భవిష్యత్ లో జరుగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ నెల 19న తెలంగాణ బంద్‌లో అందరూ పాల్గొని, ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు.ఈ సందర్భంగా ఆర్టీసీ సమ్మెకు మద్దతు ఇస్తున్న ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ప్రజలకు అశ్వత్థామరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రగతిభవన్ వద్ద.. టీఆర్టీ అభ్యర్థుల ఆందోళన

**- న్యాయం చేయాలంటూ గేటు ఎదుట బైఠాయింపు**

**- అదుపులోకి తీసుకున్న పోలీసులు**

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ప్రగతిభవన్ వద్ద టీఆర్టీ అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమకు వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీఆర్టీ అభ్యర్థులు బుధవారం ఆందోళనకు దిగారు. తమ కుటుంబ సభ్యులతో సహా వచ్చిన అభ్యర్థులు ప్రగతిభవన్ వద్ద నిరసన తెలిపేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయాలంటూ ప్రగతిభవన్ గేటు వద్ద బైఠాయించారు. రెండేళ్ల క్రితం పరీక్షలు రాసి తాము ఖాళీగా ఉంటున్నామనీ.. తమ కుటుంబాలు ఎలా బతకాలని మహిళా అభ్యర్థులు ఆవేదన వ్యక్తంచేశారు. ఎంతో కష్టపడి చదువుకుంటే రెండేళ్లుగా ఈ ఉద్యోగాల కోసం ఎదురుచూపులు చూస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కూడా తమకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని వాపోయారు. తమ సమస్య పరిష్కారమయ్యేదాకా ఆందోళన కొనసాగిస్తామని అభ్యర్థులు చెబుతున్నారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి అక్కడి నుండి వెళ్లిపోవాలని సూచించారు. కానీ తమ సమస్యను పరిష్కరించేవరకు తాము ఆందోళన విరమించేది లేదని, ప్రగతిభవన్ వద్దనే బైఠాయించి ఉంటామని అన్నారు. దీంతో పోలీసులు బలవంతంగా వారిని పక్కకు తప్పించే ప్రయత్నం చేయడంతో ఆందోళనకారులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో పరిస్థితి ఒక్కసారిగా ఉద్రిక్తంగా మారింది. అభ్యర్థుల నిరసనలతో బేగంపేట -సికింద్రాబాద్ మార్గంలో దాదాపు రెండు కి.మీల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో అభ్యర్థుల్ని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు. తమను ఇష్టం వచ్చినట్లుగా కొడుతూ ఈడ్చుకు వెళ్లడాన్ని మహిళా అభ్యర్థులు తీవ్రంగా నిరసించారు. ఇదేనా తెలంగాణ ఆడపడచులకు ఇచ్చే గౌరవమని మండిపడ్డారు. కోర్టు కేసులు క్లియర్ అయినప్పటికీ ప్రభుత్వం ఫలితాలు మాత్రం ఇవ్వటం లేదని అభ్యర్థులు ఆరోపణలు చేస్తున్నారు. టీఆర్టీ, పీఈటీ అభ్యర్థులను పోలీసులు అడ్డుకోగా వారు ప్రతిఘటించారు. అభ్యర్థులు ప్రతిఘటించటంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారిందని తెలుస్తోంది. పోలీసులు చివరకు బలవంతంగా అభ్యర్థుల్ని అక్కడినుండి తరలించారు. ఆందోళన చేసిన అభ్యర్థులను ఎక్కడికక్కడ పోలీసులు అరెస్ట్ చేసి పంపించివేసారు. అభ్యర్థులు మాట్లాడుతూ 2017లో నోటిఫికేషన్ ఇచ్చినా ఇప్పటివరకు ఫలితాలు ఇవ్వలేదని ఈరోజు రేపు అంటూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని బ్రతకాలో చావాలో అర్థం కావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 50సార్లకు పైగా ధర్నాలు చేశామని అభ్యర్థులకు చనిపోయే పరిస్థితి వచ్చిందని చెప్పారు. రెండు రోజుల్లోగా పోస్టింగ్ ఇవ్వాలని ప్రభుత్వంనుండి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు దీక్షను కొనసాగిస్తామని అభ్యర్థులు చెబుతున్నారు. పోలీసులు అరెస్ట్ చేస్తే పోలీస్ స్టేషన్ లో దీక్షను కొనసాగిస్తామని అభ్యర్థులు చెబుతున్నారు. మరోవైపు సీఎం క్యాంప్ ఆఫీస్ ను ముట్టడించటానికి ఎవరు ప్రయత్నించినా అరెస్ట్ చేస్తామని పోలీసులు చెబుతున్నారు. సీఎం క్యాంప్ ఆఫీస్ దగ్గర ధర్నా చేయటానికి ఎటువంటి అనుమతులు లేవని అందువలన అరెస్ట్ చేస్తున్నామని పోలీసులు చెప్పారు. మరో అభ్యర్థి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు కోచింగ్ తీసుకున్నానని ఫలితాలు ఇవ్వకుండా రెండు సంవత్సరాల నుండి కాలయాపన చేయటం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించాడు. పోస్టింగ్ ఇవ్వకపోతే మా పిల్లల్ని ఎలా చదివించుకోవాలని చెబుతోంది. అభ్యర్థులు తమ న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కారించాలని ఫలితాలు విడుదల చేసి 1:1 రేషియోలో పోస్టింగ్ ఇవ్వాలని కోరారు.

# ఆర్టీసీ కార్మికులు కేసీఆర్ వెన్నంటే ఉన్నారు

- రాజకీయ, కార్మిక సంఘాల నాయకులే కార్మికులను రెచ్చగొడుతున్నారు
- హుజూర్‌నగర్‌లో 20వేల మెజార్టీతో గెలుస్తాం

**- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

వరంగల్, అక్టోబర్16(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులు ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ వెన్నంటే ఉన్నారని పంచాయతీరాజ్ శాఖా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. బుధవారం ఆయన ఓ టీవీ ఛానెల్‌తో మాట్లాడుతూ.. కార్మిక సంఘాల నేతలు, రాజకీయ నాయకులే కార్మికులను రెచ్చగొడుతున్నారని, దీంతోనే కార్మికులు సమ్మెకు బలవంతంగా వెళ్తున్నారని అన్నారు. ఆర్టీసీ సమస్య త్వరలోనే పరిష్కారవవుతుందని దయాకర్ రావు ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు. తండ్రి పాత్రలో ఉన్న సీఎం కేసీఆర్... తన పిల్లలైన ఆర్టీసీ కార్మికులను పిలిపించి మాట్లాడతారని విశ్వాసం వ్యక్తం చేశారు. పిల్లలు అన్నప్పుడు తండ్రిపై అలుగుతారు కానీ తండ్రి వారిని బుజ్జగిస్తారని దయాకర్ రావు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

కోర్టు పరిధిలో ఉండటంవల్ల ఇంతకంటే ఎక్కువ మాట్లాడలేనని దయాకర్ రావు పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం సిద్ధంగానే ఉన్నారని, కానీ పండుగ సమయంలో ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెట్టేలా, ప్రజలను ఇబ్బందులకు గురిచేసేలా ఆర్టీసీ సంఘం నేతలు తీసుకున్న చర్యవల్లనే ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందన్నారు. కార్మికులంతా తమ కుటుంబ సభ్యులుగా కేసీఆర్ భావిస్తారని అన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయటం సాధ్యం కాదని చెప్పారని, ఆర్టీసీని నష్టాలనుంచి బయటపడేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని సీఎం కేసీఆర్ హామీఇస్తూనే ఉన్నారని అన్నారు. హుజూర్‌నగర్ ఉప ఎన్నికలో 20వేల మెజారిటీని సాధిస్తామని ఎర్రబెల్లి దయాకర్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు తమ సవాల్‌ను స్వీకరిస్తారా అని సవాల్ విసిరారు. ఆర్టీసీ కార్మికుల సమ్మె ప్రభావం హుజూర్ నగర్ ఎన్నికలపై ఉండదని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు తమ వెంటే ఉన్నారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## నేటికి వాయిదా పడ్డ ఉద్యోగ జెఏసి సమావేశం

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల ఐక్య కార్యాచరణ సమితి(జేఏసీ) సమావేశం గురువారానికి వాయిదా పడింది. వివిధ అంశాలు, డిమాండ్లపై చర్చించేందుకు గాను బుధవారం సమావేశం కావాలని జేఏసీ నేతలు తొలుత నిర్ణయించారు. అయితే కొన్ని అనివార్య కారణాల నేపథ్యంలో సమావేశాన్ని గురువారానికి వాయిదా వేశారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న డిమాండ్లు, సమస్యల సాధన కోసం గత కొద్ది రోజులుగా జేఏసీ నేతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే... గురువారం మరోమారు సమావేశం కావాలని జఏసీ నిర్ణయించింది. ఇదిలావుంటే ఎన్నికలు వస్తున్నాయి తప్ప ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం దొరకలేదని టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్ రెడ్డి అన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కోసం సీఎంకు వద్దకు వెళితే వదంతులు, అపోహలు రావడంతో మనస్తాపానికి గురయ్యాం. టీఎన్జీవోలు, జేఏసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే ముందుకెళుతున్నాం. కొందరు వక్రీకరిస్తే బాధపడ్డాం. మాకు మద్దతు ఇవ్వాలని ప్రతి కార్మికుడు మెసేజ్‌లు పెడుతున్నారు. ఆర్టీసీ కార్మికుల ఆవేదనను అర్థం చేసుకున్నాం. సమ్మెకు మద్దతుగా నిలవడానికి కార్యవర్గ సమావేశం నిర్వహించామని తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణ ఉద్యోగుల జేఏసీ సమావేశం బుధవారం జరగనుందని, అందులో నిర్ణయం ప్రకటిస్తాం అన్నారు. అయితే దీనిని గురువారానికి వాయిదా వేసుకున్నారు. ఆర్టీసీ కార్మికుల వెంట ఉంటాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, చర్చలకు ఆహ్వానించాలని డిమాండ్ కారెం చేశారు. త్వరలోనే ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపే బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. మా డిమాండ్లు కూడా ఉన్నాయి. ఉప ఎన్నికల తర్వాత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆ తర్వాతే మా నిర్ణయం ఉంటుందన్నారు.

## ప్రజలకు ఇబ్బందులు రానివ్వకండి

- అన్నిప్రాంతాలకు బస్సులను నడపండి
- రాజధానిలో 100శాతం బస్సులు తిరగాలి

**- టెలీకాన్ఫరెన్స్‌లో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

హైదరాబాద్, అక్టోబర్16(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ సమ్మెవల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ప్రాంతాల్లో బస్సులను నడిపించాలని, ముఖ్యంగా హైదరాబాద్‌లో 100శాతం బస్సులను నడపాలని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డీఎంలు, డీవీఎంలు, రీజినల్ మేనేజర్లతో ఆర్టీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమ్మెప్రభావం, ప్రత్యామ్నాయ ఏర్పాట్లను.. జిల్లాలోని ఆర్ఎంలను పువ్వాడ అజయ్ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరిన్ని బస్సులను.. నడిపేలా చూడాలని అధికారులను అజయ్ ఆదేశించారు. రాజధాని నగరమైన హైదరాబాద్‌లో వంద శాతం బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని అజయ్ ఆదేశించారు. సోమవారం నుంచి విద్యా సంస్థలు ప్రారంభం కానుండడంతో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి ఈ సందర్భంగా సూచించారు. కాగా జిల్లాల్లో వంద శాతం బస్సులు నడుపుతున్నామని, హైదరాబాద్ నగరంలో మాత్రం 40 శాతం బస్సులు మాత్రమే నడుస్తున్నాయని మంత్రికి ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. హైదరాబాద్ సిటీలో బస్సులను 100శాతం నడిపేలా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి పువ్వాడ ఆదేశించారు. పాఠశాలలు తెరిచే లోపు ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చూడాలని ఆర్టీసీ అధికారులను మంత్రి పువ్వాడ ఈ సందర్భంగా ఆదేశించారు. ఈ నేపథ్యంలో... అనుభవజ్ఞులైన డ్రైవర్లు కోసం ఆర్టీసీ వేట ప్రారంభించింది.

## చరిత్రలో నేటినిజం

కం॥ దీపాల పిచ్చయశాస్త్రులు
దీపము వలె వెలుగు నిడి తెలుగు జగతిలో
రూపము పొందెను - కవన
రూపమ్ముల గూర్చి నాడు రోచిర్మయుడై ॥

( అక్టోబర్ 17 దీపాల పిచ్చయ్య శాస్త్రిగారి పుణ్యతిథి..)

–రాధశ్రీ

సెల్: 9494481210



## ఆర్టీసీ సమ్మెతో మరో కార్మికుడి బలి

**గుండెపోటుతో డ్రైవర్ మృతి**

బలి హైదరాబాద్, అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెతో [illegible] డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడు. ఎరుకుల లక్ష్మయ్య అనే డ్రైవర్ మియాపూర్ డిపోలో బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. బుధవారం ఉదయం లక్ష్మయ్యకు ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. మార్గం మధ్యలో గుండె పోటుతో అతడు దుర్మరణం చెందాడు. లక్ష్మయ్య స్వస్థలం నల్లగొండ జిల్లా మర్రిగూడ గ్రామం. వారం రోజుల క్రితం చెంగిచర్ల డిపోలో పని చేసే డి. కోమురయ్య గుండెపోటుతో చనిపోయాడు. ఆర్‌టిసి కార్మికులు ర్యాలీ చేస్తుండగా తీవ్ర ఒత్తిడితోనే కోమురయ్యకు గుండె పోటు వచ్చిందని వైద్యులు తెలిపారు. రెండోవది షేక్ ఖలీల్ మియా హెచ్‌సియు డిపోలో డ్రైవర్‌గా పనిచేసేవాడు. ఆర్‌టిసి కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహించిన అనంతరం ఇంటికి వెళ్తుండగా మార్గం మధ్యలో హార్ట్ ఎటాక్ రావడతో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. గుండె పోటుతో ఇప్పటికి ముగ్గురు డ్రైవర్లు మృతి చెందగా ఇద్దరు ఆర్‌టిసి కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారు. 12 రోజుల నుంచి ఆర్‌టిసి కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరిం చాలని ఆందోళన నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

## నిష్క్రమించిన నైరుతి

హైదరాబాద్,అక్టోబర్16 (ఆంఎన్ఎ): దేశం నుంచి నైరుతి రుతు పవనాలు పూర్తిగా నిష్క్రమించాయని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు. దేశంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించాయని చెప్పారు. ఈశాన్య రుతుపవనాల ప్రభావం తెలంగాణపై తక్కువగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ రుతుపవనాల ప్రభావం దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమపై అధికంగా ఉంటుందన్నారు. బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి 1.5 నుంచి 2.1 కిలోమీటర్ల మధ్య ఏర్పడిందని తెలిపారు. రెండురోజులు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పాటు రేపు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని రాజారావు స్పష్టం చేశారు.

## నిమ్స్ చెత్తకుప్పలో శిశువు

హైదరాబాద్,అక్టోబర్16 (ఆంఎన్ఎ): అప్పుడే పుట్టిన ఆడ శిశువును చెత్తకుప్పలో పడేశారు. ఈ ఘటన నిమ్స్ ఆస్పత్రి ఆవరణలో చోటు చేసుకుంది. శిశువును ప్లాస్టిక్ కవర్‌లో చుట్టి చెత్తకుప్పలో పడేసి వెళ్లిపోయారు తల్లిదండ్రులు. చెత్తకుప్పలో పడి ఉన్న శిశువు ఏడుపు విన్న స్థానికులు వైద్యులకు సమాచారం అందించారు. చంటి బిడ్డకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఆడబిడ్డ కావడంతోనే ఆ శిశువును అక్కడే వదిలేసి వెళ్లిపోయి ఉంటారని వైద్యులు, స్థానికులు భావిస్తున్నారు. ఎవరూ వదిలిపెట్టి వెళ్లిపోయి ఉంటారనే సమాచారం కోసం ఆస్పత్రి ఆవరణలోని సీసీటీవీ ఫుటేజీలను నిమ్స్ సిబ్బంది పరిశీలిస్తున్నారు.

# జమ్మూ కశ్మీర్‌లో భీకర కాల్పులు

**- ముగ్గురు ఉగ్రవాదులు హతం**

శ్రీనగర్, అక్టోబర్16(ఆర్ఎన్ఎ) : జమ్మూ కశ్మీర్‌లో మరోసారి భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య భీకర కాల్పులు చోటుచేసుకున్నాయి. అనంత్‌నాగ్ జిల్లాలో బుధవారం ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు ముష్కరులను సైన్యం మట్టుబెట్టింది. అనంత్‌నాగ్ జిల్లా బిజ్‌బహారా ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారంతో జమ్మూ కశ్మీర్ పోలీసులు, ఆర్మీ సంయుక్తంగా బుధవారం తెల్లవారు జామున అక్కడకు చేరుకుని నిర్బంధ తనిఖీలు చేపట్టింది. ఈ క్రమంలో భద్రతా బలగాలపై ముష్కరులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో అప్రమత్తమైన సైన్యం వెంటనే ఎదురుకాల్పులు ప్రారంభించింది. ఇదే సమయంలో ఉగ్రవాదులు ఓ ఇంట్లోకి చొరబడగా... దానిని చుట్టిముట్టిన సైన్యం ముగ్గురు ముష్కరుల్ని హతమార్చింది.

భీకర కాల్పులు కొనసాగిన నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా స్థానికులను అక్కడి నుంచి ఖాళీ చేయించారు. మొబైల్ సేవలపై ఇప్పటికే ఆంక్షలు కొనసాగుతుండటంతో వదంతులు వ్యాపించకుండా ఇంటర్నెట్ కూడా నిలిపివేశారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఓ సైనికుడు సైతం గాయపడినట్టు సమాచారం. అలాగే, పజాల్‌పొర ప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నట్టు భద్రతా దళాలు స్థానికులను హెచ్చరించాయి. ఈ ప్రాంతంలోనూ సైన్యం తనిఖీలు చేపట్టింది. మరోవైపు, గాందర్బల్ అడవుల్లో నక్కిన ఇద్దరు ఉగ్రవాదుల్ని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారం రోజులుగా వీరి కోసం గాలిస్తుండగా, మంగళవారం ఎట్టకేలకు చిక్కారు. కాగా, కాల్పుల విరమణ ఒప్పందానికి పాకిస్థాన్ మరోసారి ఉల్లంఘించి ఉరి సెక్టారులో ఓ సైనికుడు, షాపూర్ సెక్టార్‌లో షమీమా అక్తర్(24) అనే మహిళను పొట్టనబెట్టుకుంది. ఉగ్రవాదుల చొరబాట్లను నిరోధించేందుకు నౌగామ్ సెక్టార్‌లో పహారా కాస్తుండగా మందుపాతర పేలి ఓ జవాను ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, సోమవారం పోస్ట్–పెయిడ్ మొబైల్ సేవలను పునరుద్ధరించగా, మంగళవారం జరిగిన సంఘటనలతో మళ్లీ నిలిపివేశారు. ఆర్టికల్ 370 రద్దుకు వ్యతిరేకంగా మహిళా సంఘాలు భారీ ర్యాలీ నిర్వహించాయి.

# అయోధ్య వివాదం.. వెనక్కి తగ్గిన సున్నీ వక్ఫ్ బోర్డు !

హైదరాబాద్, అక్టోబర్ 16: అయోధ్యలోని రామజన్మభూమి –బాబ్రీమసీదు వివాదాస్పద కేసులో సున్నీ వక్ఫ్ బోర్డు కూడా తమ వాదనలు వినిపించిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసు నుంచి ఉపసంహరించుకోవాలని సున్నీ వక్ఫ్ బోర్డు నిర్ణయించింది. సున్నీ వక్ఫ్ బోర్డులో ఉన్న సభ్యుల మధ్య వివాదం చెలరేగడమే దీనికి కారణమని తెలిసింది. వక్ఫ్ బోర్డు చైర్మన్ జేఏ ఫారుకిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అయినట్లు తెలుస్తోంది. వివాదస్పద అంశం నుంచి ఉపసంహరించుకోవాలని వక్ఫ్ బోర్డు నిర్ణయించినట్లు మధ్యవర్తి ప్యానెల్ సుప్రీంకోర్టుకు వెల్లడించింది. వక్ఫ్ బోర్డుకు చెందిన భూములను అక్రమంగా అమ్మేశారని ఫారుకిపై యూపీ ప్రభుత్వం విచారణకు ప్రతిపాదించింది. అయితే తనకు ప్రాణహాని ఉందని ఫారుకి కోర్టును కోరడంతో ఆయనకు అదనపు భద్రత కల్పించాలని సుప్రీం ఆదేశించింది. టైటిల్ సూట్ నుంచి కేసును ఉపసంహరించాలని నిర్ణయించామని, అయోధ్యలో ఉన్న 22 మసీదుల మెయింటేనెన్స్ చూసుకోవాలని వక్ఫ్ బోర్డు ప్రభుత్వాన్ని కోరింది. అయోధ్య కేసులో విచారణను సుప్రీం నేటితో ముగించనున్నది. అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ కేసును వాదించేందుకు 40 రోజుల టైంను ఫిక్స్ చేసింది. ఇవాళే చివరి రోజు. సాయంత్రంలోగా కేసు విచారణను పూర్తి చేయాలని సీజేఐ ఉదయం ఆదేశించారు.

# చిదంబరం అరెస్ట్

- తీహార్ జైలులో అరెస్టు చేసిన ఈడీ
- ఇది బోగస్ విచారణ
- రాజకీయ జిమ్మిక్కులతో సాగుతున్న తంతు

**- చిదంబరం తనయుడు కార్తీ చిదంబరం**

న్యూఢిల్లీ, అక్టోబర్16(ఆర్ఎన్ఎ) : కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి చిదంబరాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ బుధవారం అరెస్టు చేసింది. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ఆయన గత నెల రోజులుగా తిహార్ జైల్లో ఉంటున్న విషయం తెలిసిందే. కాగా బుధవారం ఉదయాన్నే ముగ్గురు ఈడీ అధికారులు జైలుకు చేరుకొని దాదాపు గంటపాటు చిదంబరాన్ని ప్రశ్నించారు. మనీల్యాండరింగ్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. అనంతరం అరెస్టు చేశారు. ఐఎన్ఎక్స్ మీడియా కేసులో 55రోజుల సీబీఐ జ్యుడీషియల్ కస్టడీ తర్వాత చిదంబరాన్ని ఈడీ అరెస్టు చేసింది. చిదంబరం ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు 2007లో 305 కోట్ల విదేశీ నిధులను స్వీకరించి నందుకు విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు ఐఎన్ఎక్స్ మీడియాకు 2017 మేలో క్లియరెన్స్ ఇచ్చినట్టు సిబీఐ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ తర్వాత ఆయన పై ఈడీ మనీలాండరింగ్ కేసులు నమోదు చేసింది. ఇదిలా ఉంటే ఐఎన్ఎక్స్ మీడియా మనీ లాండరింగ్ కేసులో చిదంబరాన్ని విచారించేందుకు ప్రత్యేక కోర్టు మంగళవారం ఈడీ కు అనుమతించింది. అవసరమైతే అరెస్ట్ చేసేందుకు వీలుగా ఆదేశాలు కూడా జారీ చేసింది. చిదంబరం అరెస్ట్‌కు అనుమతించాలని ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు విన్న ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ కుమార్ కుహర్ సోమవారం తీర్పును రిజర్వ్‌లో పెట్టారు. మంగళవారం తీర్పు ప్రకటించిన ప్రత్యేక కోర్టు.. చిదంబరంను ఈడీ ప్రశ్నించవచ్చునని, అవసరమైనపక్షంలో అరెస్ట్ చేయవచ్చునని కూడా ఆదేశించింది. కోర్టులోనే ప్రశ్నించేందుకు అవకాశం ఇవ్వాలని ఈడీ కోరగా.. గౌరవ మర్యాదలున్న వ్యక్తిని కోర్టు ఆవరణలో ప్రశ్నించడం భావ్యం కాదని, బుధవారం తీహార్ జైలుకే వెళ్లి ప్రశ్నించమని ప్రత్యేక కోర్టు సూచించింది. ఈ మేరకు ఈడీ బుధవారం ఉదయం తిహార్ జైలుకు వెళ్లి చిదంబరంను విచారించింది. కాగా చిదంబరంను కలిసేందుకు ఆయన భార్య నళి, కుమారుడు కార్తీ చిదంబరం బుధవారం ఉదయం తిహార్ జైలును సందర్శించారు. తన తండ్రి ఎన్ని ఇబ్బందులు ఎదురైన సానుకూల స్ఫూర్తితో ఉన్నారని, రాజకీయ జిమ్మిక్కులతో సాగుతున్న ఈ తంతును ఆయన ఎదుర్కొంటారని కార్తీ చిదంబరం పేర్కొన్నారు. ఇది బోగస్ విచారణ అని కార్తీ తన తండ్రిని కలిసిన అనంతరం వ్యాఖ్యానించారు.

## సోమవారంలోగా జీతాలు చెల్లించాలి

# ఆర్టీసీ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశం



హైదరాబాద్, అక్టోబర్16(ఆర్ఎన్ఎ) : ఆర్టీసీ కార్మికులకు సోమవారం లోగా జీతాలు చెల్లించాలని ఆర్టీసీ యాజమాన్యానికి హైకోర్టు ఆదేశించింది. సమ్మె నేపథ్యంలో ఆర్టీసీ కార్మికులకు సెప్టెంబర్ నెల వేతనాలు అందకపోవడంపై హైకోర్టు విచారణ చేపట్టింది. సెప్టెంబర్ నెల జీతాలు చెల్లించలేదని జాతీయ టీఎంయూ కోర్టులో పిటిషన్ వేసింది. ఆర్టీసీలోని 49,190 మంది కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించేలా ఆదేశించాలని పిటిషనర్ కోరారు. అయితే ఆర్టీసీ యాజమాన్యం కోర్టుకు వివరణ ఇచ్చింది. సిబ్బంది సమ్మె వల్లే చెల్లింపుల్లో ఆలస్యమైందని తెలిపింది. ప్రస్తుతం సమ్మె కొనసాగుతున్న నేపథ్యంలో సిబ్బంది లేరని కోర్టు దృష్టికి తీసుకువెళ్లింది. సోమవారంలోపు జీతాలు చెల్లిస్తామని వెల్లడించింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు సోమవారంలోపు వేతనాలు చెల్లింపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించింది. దీనికి సంబంధించిన తదుపరి విచారణను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది. కోర్టు తీర్పుపై ఆర్టీసీ కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆర్టీసీ కార్మికులు సమ్మెను విరమించాలని, వారితో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని హైకోర్టు ధర్మాసనం మంగళవారం సూచించింది. ప్రభుత్వంతో తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ప్రకటించింది. అయితే ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి స్పందన రాకపోవడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. మరోవైపు ఆర్టీసీ కార్మికుల సమ్మెకు టీఎన్జీవో, టీజీవో సంఘాలు మద్దతు ప్రకటించాయి. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ హెచ్చరించింది.

## శివసేన ఎంపీపై కత్తితో దాడి

ముంబయి, అక్టోబర్ 16: మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో శివసేన పార్టీ జోరుగా ప్రచారం చేస్తోంది. బుధవారం ఉదయం ఆ పార్టీ ఎంపీ ఓమ్‌రాజే నీమ్‌బల్కార్ ఉస్మానబాద్ జిల్లాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పడోలి నైగావ్ గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఓమ్‌రాజే పాల్గొన్నారు. అయితే ఓమ్‌రాజే వద్దకు వచ్చిన ఓ వ్యక్తి షేక్‌హ్యాండ్ ఇచ్చినట్టే ఇచ్చి.. ఆ తర్వాత ఎంపీపై కత్తితో దాడి చేసి పారిపోయాడు. అప్రమత్తమైన పోలీసులు, శివసేన కార్యకర్తలు ఆ వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఎంపీ ఓమ్‌రాజే చేతికి స్వల్ప గాయమైంది. ఓమ్‌రాజే ఉస్మానాబాద్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. నీమ్‌బల్కార్ తండ్రి పవన్‌రాజే నీమ్‌బల్కార్ కాంగ్రెస్ నాయకుడు. పవన్ రాజే ఎంపీగా సేవలందించారు. ఈయన 2006, జూన్ 3వ తేదీన ముంబయి – పుణె ఎక్స్‌ప్రెస్ వేపై హత్యకు గురయ్యారు. పవన్‌రాజే హత్య కేసులో మాజీ ఎంపీ పదమ్‌సిన్హ్ పాటిల్ నిందితుడు.

నేటినిజం

# సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com

గురువారం 17-10-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

మూఢ నీడలు
మంటల్లో అల్పజీవి
మరే దెన్నడు

దవఖానాలు
పేదలకు నరకం
పైసకు స్వర్గం

మేకల మంద
కర్రలేని కాపరి
వన విలాపం

మార్కెట్లో గోల
చెల్లని పదిబిళ్ల
చిల్లర జ్వరం.

ప్రజల వాణి
అక్కడంత అల్లరే
ఓటు ఓడింది



– రేడియమ్
9291527757

## శ్రీనిజాలు

కోర్కె తీరేందుకు సమ్మె
కార్మికులకు హక్కు!
కత్తి గాట్లు ఎన్ని పెట్టు
తుక్కు కాదు ఉక్కు!

ప్రభుత్వ మొండి వైఖరే
ప్రజకు యముని పాశం!
విదూషకుని మాటలొద్దు
వేసి రాజు వేషం!



– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## జీవన సాఫల్యత..

నేటి విజయ పుష్పం
రేపటి పూజకు పనికి రాదు కదా
నిత్య జయారాధనకు
రోజుకో కొత్త పువ్వు కావల్సిందే మరి!

జేబులు నిండిన బాబుల చుట్టు
బెల్లం చుట్టూ ఈగలే
ఆకలి, అజ్ఞాన అస్తి చుట్టూ
అనంత ఏకాంత కారు మబ్బులే మరి!

గులాబీని ముద్దాడాలంటే
ముళ్లతో జర భద్రం బ్రదర్
విజయ తీరం చేరాలంటే
వైఫల్య అలలు దాటాల్సిందే సుమా!

బాయినీరు తోడితేనే కదా
తేట నీటి ఊట ఉబుకు
శ్రమశక్తిని ధారపోస్తేనే కదా
సంపద, సత్కీర్తి పంట పండును!

లెక్కకు మిక్కిలి సవాళ్ళు..
స్వారీ చేస్తేనే విజయాలు
దుర్వ్యసనాలకు బ్రేకప్‌లే
మరో ప్రపంచానికి వేకప్‌లు!



– డా॥ బుర్ర మధుసూదన్‌రెడ్డి
9949700037

## చితి-చింత

చితియు చింతా
రెండూ ఒక్కటే
ఒకటి కాల్చివేయును
ఇంకోటి కూల్చివేయును.

చితి ధగ ధగమండుచూ
పచ్చిది వట్టిది దహించివేయును
దావానలంలా వ్యాపించి దర్శనమిచ్చును
ధరలోన దానికున్న విలువే వేరు.

చింత సజీవంగా వున్న మనిషిని
నిమిష నిమిషానికి కృంగ దీయును
నిశ్చలతలేక చంచల మనిపించును
దానికి హద్దులేదు అంతము లేదు.

జీవితాంతము జిగురు పట్టినట్లు
నిద్ర, ఆహారానికి దూరం చేయును
నిలకడగా ఉండక నిస్పృహలో ఆలోచించక
అంతకంతకు అంతమొందించును
ఒకటి కండ్లముందే
అంతిమంగ అంతమొందించును
ఒకటి కండ్ల వెనుక క్షణక్షణం అంతం చేయును
ఒకటేమో అగ్గిపిడుగు
ఒకటేమో, చలిపిడుగు.



– కురిమెల్లి లింగయ్య
9848934578

## నేడు రేపు నాదే!

జీవితం అమృతంగా గడిచిపోయింది
అడుగు అడుగు విషం అలుముకొన్నా
హృదయం పూల జల్లుగానే వుంది
ఎన్ని ముళ్లు పొడిచినా
పర్వాలేదు
నేను ఓడిపోని వీరున్ని!
లక్ష్యాన్ని చేరుకొన్న ధీరున్ని
నా వెనుక కుట్రలు కుతంత్రాలు, కుయుక్తులు
ఎప్పుడూ లేవు కానీ
ఇప్పుడు ప్రారంభించారు.
ఈర్ష్య అసూయ విషంనేలగా మారింది
నాకు అడుగు నేల లేదు
ఇంట్లో గవ్వలేదు
బ్యాంక్ ఖాతా లేదు
పర్వాలేదు!
నేను ఆకాశం అందుకొన్న పావురాన్ని నేను
స్వార్థం ఎరుగని ఇంద్రధనస్సును నేను
మెరుస్తున్న నక్షత్రాన్ని నేను
ఆశలేవీ లేని అడుగునాది
అక్షరాలు ఎగిరేస్తూనే వుంటాను
గాలిలో వ్యాపించినా, వ్యాపించకున్నా
సుగంధం ఎటుపోతుంది?
రేపటి చరిత్ర నాది!
అవార్డులు, సన్మానాలు పురస్కారాలు
శాలువాలు
చరిత్రను వక్రీకరిస్తాయి
నిలబెట్టలేవు.



-సి. హెచ్. మధు
9949486122

## నానీలు

కన్నీరు
ఉప్పుగా ఎందుకుంటది
దాని మూలాలూ
సముద్రమంత లోతేమో!

మేఘాలు
జలనిధి కన్నబిడ్డలు
తిరిగి తిరిగి
పుట్టింటికే చేరుతై!

నీటిదీ
పిల్లల మనస్తత్వమే!
అలుగుతే మంచు
కోపమొస్తే ఆవిరే!

సౌరకుటుంబానికి
ఆడబిడ్డయింది భూమే!
హృదయంలో
తడి ఉన్నందుకే!



-సి.వి.శ్రీనివాస్
9985809434

పుస్తక సమీక్ష

# అంబల్ల జనార్ధన్ "ముంబయి చూపుతో" తెలుగు కథానికలు



**తెలుగు కథ పురుడు పోసుకుని వంద సంవత్సరాలు దాటింది. అప్పటి నుండి వివిధ పరిణామాలను ఒరుసుకుంటు, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటు, సమాజంలోని అసంఖ్యాక దృక్పథాలకు దర్పణం పట్టు, అంతు చిక్కని మానసిక సంఘర్షణలను చిత్రిక పట్టు, జీవన సందర్భాలను, జీవిత అనుభవాలను ఒడిసి పట్టు, సాహిత్య, సామాజిక ప్రయోజనాలను సిద్ధించుకుంటు తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట ప్రక్రియగా వ్రేళ్ళూనుకుంది. యిది వరలో చక్కని యితివృత్తం, చిక్కని కథనం, ఊహకందని మలుపులు, విస్మయపరచే ముగింపుతో కథలను అల్లేవారు. అందుకే ఆ కథలు చిరస్మరణీయం. ఆ కథకులు చిరస్మరణీయులు.**

యిప్పుడు కథ కొత్త పుంతలు తొక్కుతోంది. దృష్టికొచ్చిన సంఘటన కథ అవుతోంది. స్వీయానుభవమో.. పరాయి అనుభవమో యథాతథంగా దర్శనమిస్తోంది. పాత్రల ద్వారా పరుగులెత్తాల్సిన కథనం.. కథకుడు అడుగడుగునా అడ్డు తగలడంతో చతికిల పడ్తోంది. అంతర్లీనంగా ఒదగాల్సిన సందేశం సర్‌ఫేస్ అవుతు కథ వ్యాసంలా తేలిపోతోంది. పట్టుమని పది పంక్తులను గూడ చదివించలేని కథలు కోకొల్లలుగా దర్శనమిస్తున్నాయి.

అలా అని కథా సాహిత్యం వెల వెల పోవట్లేదు. ఆణిముత్యాల్లాంటి కథలు అప్పుడప్పుడు పలకరిస్తునే వున్నై. వస్తు వైవిధ్యంతో అలరారుతునే వున్నాయి.

అంబల్ల జనార్ధన్ 'ముంబయి చూపుతో' చూసినట్టయితే కొత్త, కొత్త ఆలోచనలు, క్రొంగొత్త దృష్టితో తీర్చిదిద్దిన కథలు కొన్నింటిని ఆస్వాదించవచ్చు.

ఈ రోజుల్లో కవులకు, రచయితలకు విరివిగా రాయడానికి **'వృద్ధాశ్రమాలు'** ఓ వనరుగా మారింది. యిష్ట పూర్వకంగా ఈ ఆశ్రమాలను ఆశ్రయించే వారు కొందరయితే.. అనివార్య కారణాల వల్ల చేరేవారు అసంఖ్యాకంగా వున్నారు. యిమడలేనితనం, స్వాభిమానం, నిర్లక్ష్యానికి గురి కావడం, ఆశించిన ప్రేమాభిమానాలు కరువు గావడం, డాలర్ల మోజులో కన్నబిడ్డలు విదేశాలకు ఎగిరిపోవడం.. యిలా కారణాలు ఏవైనా కావొచ్చు. 'వృద్ధాశ్రమాల' సంఖ్య రోజు, రోజుకీ పెరుగుతూనే వుంది. ఒకొక్కరిదీ ఒక్కో గాథ వ్యథ. దీనికో పరిష్కారం సూచిస్తున్నారు అంబల్ల **"అనాస కేంద్రం"** ద్వారా. పెద్దల అనుభవాలను, దిశా నిర్దేశాన్ని కోరుకుంటున్న యువ జంటలు ఎన్నో వున్నాయి. అలాగే కన్న బిడ్డలు దగ్గరలేక, ప్రేమను పంచలేక మానసిక క్షోభ ననుభవిస్తున్న వృద్ధులు చేరదీయగలిగితే సాంత్వన పొందడానికి చకోర పక్షుల్లా ఎదురు చూసే యువతరమూ వుంది. అందుకే యువ జంటలకు తోడుగా పెద్దలు, పెద్దలకు ప్రేమను పంచుతు యువతరం ఒకరికి ఒకరు దత్తతకు వెళ్ళడమే లక్ష్యంగా రచయిత ప్రతిపాదించిన సంస్థ 'అనాస' (అమ్మా నాన్నల సహకార సంస్థ). యిక వృద్ధాశ్రమాలెక్కడివి? వినడానికి బాగుంది కదూ! ఆచరణలోకి వస్తే మరీ బాగుంటుందేమో!!

రచయిత మరో కొత్త ఆలోచన "మరో గొలుసు పంపిణీ పథకం" తొందర పడకండి.. ఇది 'మనీ సర్క్యులేషన్ స్కీమ్' కాదు. రచయితలకు వెసులుబాటు కల్పించే గ్రంథాల పంపిణీ పథకం. కవులు, రచయితలు తమ రచనల్ని, ఉచితంగా పంచుకునే రోజులివి. కొని చదివే పాఠకులు అక్కడక్కడా లేకపోలేదు. అందుకే సాహిత్యాభిమానులకు ఓ చిట్కా వినిపిస్తున్నారు అంబల్ల. "ఒక వ్యక్తి వేయి రూపాయిలు కట్టి సభ్యుడైతే, అతనికి రెండు వేల రూపాయల ముఖ విలువ గల పుస్తకాలు అందుతాయి. అతనుగాని మరో నలుగురు సభ్యులను చేర్పిస్తే, సభ్యుడికి రెండువందల యాభై చొప్పున అతను కట్టిన సభ్యత్వ సొమ్ము తిరిగి వచ్చేస్తుంది. పోనీ కొత్త సభ్యుల్ని చేర్చకపోయినా నష్టమేంలేదు. తన కందిన పుస్తకాలు సగం అమ్మినా అతని పెట్టుబడి తిరిగి వచ్చేస్తుంది. సంస్థ నుండి ఓ మాసపత్రిక జీవితాంతం ఉచితంగా అందుతునే వుంటుంది".. యిదీ అంబల్లగారి గొలుసు పంపిణీ పథకం. రచయిత కొత్తగా ఆలోచించగలిగితేనే సాహిత్య ప్రయోజనం సిద్ధిస్తుంది.

కథా రచనకు అంబల్ల జనార్ధన్ కొత్తేంగాదు. పాతిక సంవత్సరాల అనుభవం. పుట్టినప్పటి నుండీ ముంబయిలోనే స్థిర నివాసం. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలో సుదీర్ఘకాలం ఉద్యోగించి పదవీ విరమణ పొంది కూడా దశాబ్ద కాలం గడిచింది. కథ, కవిత్వం, వ్యాసం. అనువాదం యిలా అనేక ప్రక్రియల్లో పదహారు గ్రంథాలు వెలువరించారు. వీరి రచనలు ఆంగ్లం, హిందీ, ఒరియా, మరాఠి, గుజరాతీ భాషల్లోకి కూడా అనువదింపబడ్డాయి. 69 ఏళ్ళ అంబల్ల జనార్ధన్‌ది రాయకుండా వుండలేని స్వభావం. ఆయన తాజాగా వెలువరించిన 46 కథల సంపుటి **"ముంబయి చూపుతో".**

వెలుగును పంచడానికి మాత్రమే చమురుని పీలుస్తుంది దీపం. అదీ కావలసినంతే. అలాగే మనిషి కూడా బతకడానికి సంపాదించాలేగాని కేవలం సంపాదనే ధ్యేయం కాకూడదు. సంపాదనతో బాటు అంతో, యింతో సేవా దృక్పథం కూడా వుండాలని సందేశమిచ్చే కథ **"చమురు దీపం".** ఈ కథ రెండు దశాబ్దాలుగా మహారాష్ట్రలో 8,9వ తరగతి పుస్తకాల్లో పాఠ్యాంశంగా చోటు జేసుకోవడం ప్రశంసనీయం. తెలుగువాడిగా గర్వకారణం.

జనార్ధన్ పూర్వీకులది నిజామాబాద్ జిల్లా, మోర్తాడ్ మండలం, ధర్మోరా గ్రామం. తన ప్రాంతపు భాషంటే ఈయనకు మక్కువ ఎక్కువ. తెలంగాణ భాషా పరిమళాలు పోహళించి సృజించిన కథ **'ఒర్ది'.** క్రమబద్ధీకరణకు నోచుకోని అసంఘటిత కార్మికుల శ్రామిక గాథయిది. ముఖ్యంగా బీడీ పరిశ్రమలో ప్రభుత్వ లెక్కల్లోకి రాని, ప్రావిడెంట్ ఫండ్‌కు నోచుకోని out sourcing కార్మికులు.. కమీషన్ ఏజెంట్ల దోపిడీకి గురయ్యే అభాగ్యుల దీన పరిస్థితికి అద్దం పట్టిన కథ. ముదుపు, ఐనార్లు, పత్తకులేరు, లెంకి లెంకి, రజ, సుద్దులు, మయ్యల్ యిలా ఈ ప్రాంతపు వాడుక పదాలతో సహజత్వాన్ని అద్దారు.

ఆఫీసుల్లో దైనందిక జీవితంలో ఎదురైన సంఘటనలను కథానికలుగా యథాతథంగా రాసినవి చాలానే వున్నాయి. కథను వెతుక్కోకుండా జీవన సందర్భాలుగా గ్రహిస్తే, **'ఆఫీసు ఆస్తి', 'కొత్త నీరు', 'ఆత్మీయం'** వంటి రచనలు ఫరవాలేదు అనిపిస్తాయి.

సందీప్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్.. కోటీశ్వరుడు క్షణం తీరికలేని వ్యాపకం. లేనిదల్లా సంస్కారం. బలహీనత అతని 'తల్లి'. అమ్మకూచిలా పెరిగాడు. తల్లిదే పెత్తనం. ఆమె చెప్పిందే వేదం. యిల్లంతా కృత్రిమ వాతావరణం. అహం, యితరుల పట్ల నిర్లక్ష్యం ఆమె ఆస్తులు. అలాంటి కొంపలో కొత్త కోడలిగా అడుగు పెట్టింది వనిత. అక్కడ ప్రేమలు లేవు. భర్త ఆదరణ లేదు, అత్తగారి వేదింపులు, పెత్తనం తప్ప. కనీసం మనిషిగా కూడా గుర్తింపులేని జీవితమైంది. అంటీ ముట్టనట్టుగా ప్రవర్తించే భర్త సందీప్‌తో ఏం చెప్పుకున్నా గోడతో మొరపెట్టుకున్నట్టే. ప్లాస్టిక్ బ్రతుకైపోయింది. యింతలో ఓ బిడ్డ పుట్టుకొచ్చాడు. అత్తింటితో బంధం ముడిలా చిక్కు బడింది. ఈ నరక కూపం నుండి బయటపడి 'దరి చేర్చే దారి' కోసం అన్వేషించ సాగింది వనిత. అంది పుచ్చుకుంది. అత్తింటి ఆగడాలతో, భర్తల నిరాదరణతో కృంగి కృశించి పోతున్న వనితలాంటి ఆడపడుచులు సమాజంలో కోకొల్లలుగా దర్శనమిస్తారు. అలాంటి వారికి వనిత ఎంచుకున్న దారి నచ్చుతుందా? హృద్యమైన కథ **"దరిచేర్చిన దారి".**

కేవలం కులం, హోదా కారణంగా మనస్ఫూర్తిగా ప్రేమించిన వాణ్ని దూరం చేసుకుంటున్న అమాయక స్త్రీలు ఎందరో వున్నారు. స్త్రీవాదజెండా ఎగరేస్తు పెళ్లి విషయంలో మాత్రం వయస్సులో, చదువులో, ఆస్తిలో అన్ని విధాలా పురుషాధికారాన్ని స్త్రీలు ఎందురు కోరుకుంటారు? ఈ ప్రశ్నలకు సమాధానం కావాలంటే 'గమనం మార్చిన గాలి' కథ చదవాల్సిందే. ఈ సంపుటిలోని మంచి కథల్లో యిదొకటి. ఆరోగ్య రహస్యాలు తెలుసుకోవాలనుందా? కొంచెం ఖరీదెక్కువ సుమా! **"జాంబవంతుడు- జాగింగ్‌ట్రాకూ"** పరికించండి తెలుస్తుంది.

సాహిత్య సభల ప్రహసనాలు ఆస్వాదించాలనుంటే **"చారాణా కోడికి"** పై ఓ లుక్కేయండి నవ్వు వస్తుంది. రచయితల పాట్లు చూసి జాలీ కలుగుతుంది.

అప్పు తీసుకోవడం తప్పు కాదు. బ్యాంక్ నుంచైనా సరే.. ప్రైవేట్ వ్యక్తుల నుంచైనా సరే. సమయానికి చెల్లిస్తే సరి! లేకపోతే? **'విచిత్ర గుప్తీయం'**లో వివరిస్తారు అంబల్ల. ఎంతైనా బ్యాంకర్ కదా! ఫైనాన్స్ మాయాజలం! వివరించి చెప్తారు.

**"నా కథకు బహుమతి వచ్చిందండోయ్!"** అని సంతోషంగా అరిచాడు ఓ రచయిత. యిక చదవండి ఆయన తిప్పలు.. కష్టాలు.

పెళ్ళిళ్ళలో జరిగే సరసాలు, సరదాలు, సంబురాలు, అలకలు, పట్టింపులు, వాదోపవాదాలు, గొడవలు వీటన్నింటితో సరి పెట్టుకుంటే సరే! కానీ ఒక్కోసారి కక్షలకు దారి తీసే అవకాశం వుంది. **"లగ్గం సంబురం"** కాస్తా విషాదంగా పరిణమించే ప్రమాదం వుంది అంటున్నారు అంబల్ల. కొన్ని కథలు సాదాసీదాగా వ్యాసాల్లా స్ఫురిస్తే.. అది పాఠకుడి తప్పు కాదు. రెండు. మూడు పంక్తుల్లో చెప్పాల్సిన విషయం పేజీలకు పేజీలు సుదీర్ఘ సంభాషణతో పాత్రల ద్వారా చెప్పిస్తే చదువరులకు రసాభంగం కలుగుతుందని అంబల్లవారికి తెలీదని కాదు. ఎడిటింగ్‌లో ఇలాంటి కథల్ని మినహాయించి వుంటే సంకలనానికి వచ్చే నష్టం కూడా ఏమీ లేదు.

ముగింపు పలుకుదామంటే మా సంగేతేమిటి? అంటు మరి కొన్ని మంచి కథలు రెక్కలు విసురుతున్నై. మీరు చేతుల్లోకి తీసుకోరూ.. మంచి కథలను ఆస్వాదించామన్న అనుభూతికి లోనవుతారని నా నమ్మకం.

ప్రతులకు: డా॥ అంబల్ల జనార్ధన్
బి-204, ధీరజ్‌కిరణ్ సిహెచ్ఎస్ లిమిటెడ్
ఇనఫాంట్ జీసెస్ స్కూల్ దగ్గర మరియు దాల్మియ కాలేజీ,
చించోలి బందర్ రోడ్(ఆఫీస్)
మలాడ్ వెస్ట్, ముంబయి-400 064
మరియు నవోదయ,
నవచేతన పబ్లిషింగ్ హౌస్
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్



– రమణ వెలమకన్ని
సెల్: 9704158488

# మాతృభాషపై మమకారంగల అంబల్ల- సిద్ధారెడ్డి

తల్లిదండ్రులు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాకు చెందినవారైనా వృత్తిరీత్యా ముంబయికి తరలివెళ్లినా, తాను తెలుగుగడ్డపై పుట్టి పెరగకపోయినా తెలుగుభాష, తెలుగు వారన్నా ఎంతో మక్కువతో వేరే రాష్ట్రంలో ఉన్నా మాతృభాషవల్ల మమకారంతో తెలుగును నేర్చుకొని తెలుగు కథానికలతో ముంబయి చూపుతో పుస్తకాన్ని రచించిన సంపాదకుడు బైస దేవదాసు, సినీ నటుడు ఆనంద చక్రపాణి, గ్రంథ పరిచయకర్తగా ప్రముఖ రచయిత సినీ దర్శకుడు డా॥ ప్రభాకర్ జైనీ తదితరులు పాల్గొన్నారు. ముందుగా సభకు మానస ఆర్ట్ థియేటర్స్ కార్యదర్శి రఘుశ్రీ స్వాగతం పలికారు. అనంతరం ముఖ్య అతిథి డా॥ నందిని సిధారెడ్డి తదితర అతిథుల చేతుల మీదుగా



రచయిత అంబల్ల జనార్ధన్‌ను సత్కరిస్తున్న అతిథులు.

గొప్ప సృజనాత్మక రచయిత డా॥ అంబల్ల జనార్ధన్ అని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో, శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ ముంబయి రచయిత డా॥ అంబల్ల జనార్ధన్ రచించిన "ముంబయి చూపుతో" తెలుగు కథానికలు పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥ ఏనుగు నర్సింహారెడ్డి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సీనియర్ డా॥ అంబల్ల జనార్ధన్ రచించిన 'ముంబయి చూపుతో' తెలుగు కథానికల పుస్తకాన్ని ఆవిష్కరించారు. సిధారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వాళ్లకు ముంబయి సాంస్కృతిక కేంద్రమని, హైదరాబాద్‌కు రాజకీయ చైతన్యం ముంబయి నుంచి అందిందని చెప్పారు. అంబలి అనే పదానికి తెలంగాణ అన్నం అని అర్థమని దాని ఇంటిపేరు ఉన్న జనార్ధన్ పాఠకులకు ఆకలిని తీర్చే కథలను రచించారని కొనియా డారు. తెలంగాణలో పేదరికం నుంచి వచ్చిన రచయిత మాతృమూర్తి బీడీలు చుట్టుకుని జీవనాన్ని అనుభవించి ముంబయ్‌లో వృత్తిపరంగా స్థిరపడ్డారని గుర్తు చేశారు. చిన్నప్పుడు తాను అనుభవించిన జీవిత సంఘటనలను, ముంబయ్‌లో అనుభవాలను మేళవించి ఈ కథలను రచించారని చెప్పారు. అమ్మానాన్న, అక్కాచెల్లెలు, అన్నదమ్ముల అనుబంధాలను హృదయానికి హత్తుకునే సన్నివేశాలు ఈ కథల్లో కనిపిస్తాయని చెప్పారు. సెల్‌ఫోన్‌లో మునిగిపోయిన నేటి తల్లిదండ్రులకు ఆనాటి ప్రేమానురాగాలు తెలియకుండా పోతున్నాయని చెప్పారు. ఈ కథానికల్లో అలాంటి ప్రేమానురాగాలు కనిపిస్తాయని చెప్పారు. ఈ పుస్తకంలో అద్భుతమైన 46 తెలుగు కథానికలున్నాయని, అందులోని కొన్ని కథానికల్లో ముఖ్యాంశాలను ఆవిష్కరించాయన్నారు. ఏనుగు నరసింహారెడ్డి అధ్యక్షోపన్యాసంలో రచయితకు తెలుగుపట్ల ఉన్న గౌరవాన్ని వివరించారు. అనంతరం మామిడి హరికృష్ణ, బైస దేవదాసు, ఆనంద చక్రపాణి ప్రసంగించారు. కార్యక్రమాన్ని మానస ఆర్ట్ థియేటర్స్ ఉపాధ్యక్షురాలు డా॥ లలితవాణి పర్యవేక్షించారు.



'ముంబయి చూపుతో' "పుస్తకావిష్కరణలో డా॥ ప్రభాకర్ జైని, బైస దేవదాసు, డా॥ ఏనుగు నర్సింహారెడ్డి, ఆవిష్కర్త డా॥ నందిని సిధారెడ్డి, రచయిత అంబల్ల జనార్ధన్, ఆనంద చక్రపాణి, రఘుశ్రీ, అరుణ నాయిక్, మయూర్ నాయిక్.

భయం లేదని చెప్పడం
భయమున్నందుకే!
అలాంటి భయమున్న చోట
ప్రేమ నిలవలేదు...
నిజమైన ప్రేమలో భయానికి
తావు లేదు..

-మునిమడుగుల ఫిలాసఫీ.
7013577140.

# సమాజోద్ధారకుడు.. సుద్దాల హనుమంతు- మంత్రి శ్రీనివాస్‌గౌడ్



విప్లవ నటుడు ఆర్.నారాయణమూర్తికి 'సుద్దాల' జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న మంత్రి వీ. శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో సుద్దాల అశోక్‌తేజ, సుద్దాల అర్జున్‌తేజ, ఎస్.ఎస్. తేజ తదితరులున్నారు.

సమాజంలోని అవకతవకలను, ప్రజా సమస్యలను ఎత్తి చూపుతూ ఆనాడే ఎన్నో పాటలు రాసి సుద్దాల హనుమంతు సమాజోద్ధారకుడిగా అవతరించారని పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి వి. శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సుద్దాల ఫౌండేషన్ దశాబ్ది సంబురాల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'సుద్దాల హనుమంతు-జానకమ్మ'ల జాతీయ పురస్కారాన్ని ప్రముఖ సినీ నటుడు, దర్శక నిర్మాత ఆర్.నారాయణమూర్తికి ప్రదానం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ 1940లలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కాలంలో సుద్దాల హనుమంతు విప్లవాత్మక రచనలతో తిరుగబడ్డారని గుర్తు చేశారు. హనుమంతు గొప్ప మానవతా శక్తి అని, మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆర్. నారాయణమూర్తి మంచి మేధావి, ఆలోచనాపరుడని, ఈ పురస్కారానికి అర్హుడని చెప్పారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ 'సంతోషాలను మాకిచ్చి.. సంతాపాలను నువ్వు వోసి.. జీవితమంతా నడిచి నడిచి అలసిపోయావా.. నాన్నా' అనే పాటను పాడి తన తండ్రిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ముందుగా సుద్దాల భారతి ప్రార్థనా గీతాన్ని ఆలపించగా.. సుద్దాల అర్జున్ తేజ స్మారకోపన్యాసం చేశారు. సుద్దాల సుధాకర్ తేజ సభకు అధ్యక్షత వహించారు. 'ఆడ కూతురా.. నీకు అడుగడుగున వందనం" అనే పాటను సుద్దాల సాహితీ పాడారు. సమావేశంలో సుద్దాల ప్రభాకర్, సీనియర్ జర్నలిస్టు కే. రామచంద్రమూర్తి, డా॥పోరెడ్డి రంగయ్య, కోయి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుల్లా మురళీఆకాశ్ మొదటి నవల

# ముగింపు లేని కథ

(గత వారం తరువాయి..)




ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో గల చిప్పగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పుల్లా మురళీ ఆకాశ్ రాసిన మొదటి నవల “ముగింపులేని కథ” ను గత ఆరు వారాలుగా ప్రచురించడం జరిగింది. ఈ రచనను చదివి చాలా మంది తమ తమ స్పందనలు తెలిపినందులకు ధన్యవాదములు. ఇది చివరి భాగం

-సంపాదకులు

**“ఏమండీ పొద్దుననగా వెళ్ళారు, ఇప్పుడా వచ్చేది” అనడంతో మళ్ళీ ఈ లోకం లోకి వచ్చాను. డోర్ తెరుస్తూ అబ్బా రాఘవయ్య కొడుకుది పెళ్ళికెళ్ళి వచ్చేలోగా ఆలస్యమైంది.**

“సరేలేండి కాళ్ళు ముఖం కడుగుకొని రండి టీ తాగుదురు” “ఇంట్లో వాళ్ళు కంగారు పడతారు అనేదే లేదు అంటూ లోపలికెళ్ళి పోయింది”. “ఇదిగోండి ముఖం తుడు చుకోండి” అంటూ చేతికి టవల్ అందించింది.

“ముఖం కడుక్కోవడానికి వేడినీళ్ళు పెట్టమని నీకు ఎన్నిసార్లు చెప్పాలి.

“మీరు కూడ ఇంట్లో వాళ్ళకి చెప్పి బయట ఎంతసేపైనా వుండమని ఎన్నిసార్లు చెప్పాలి”

“అబ్బా ! వదిలెయ్యవే...”

“మీరా నేనా మొదలుపెట్టింది”

“ఎవరు మొదలుపెట్టినా మీరే కదా ముగించేది”

ఇలాంటి మాటలకేమి తక్కువలేదులేండి, “ఈ టీ తీసుకోండి” అంటూ చేతిలో పెట్టింది.

“అబ్బా కాలుతుంది” అని అరిచాను.

నిజంగా కాలుతుందా ! క్షమించండి నన్ను ! అంటూ చేతి నుంచి తీసుకొని గోడమీద పెట్టింది.

“ఇది చెయ్యి చూపించండి అంటూ చేయి పట్టుకొని చూస్తుంది.

“వూరికేనే లేవే ! నా మీద ప్రేమ ఎంత వుందో చూద్దాం అని !

“ఇలా చేస్తేనే నాకు కోపం వచ్చేది”.

“సారేలే మేడపైన వున్న చెట్లకి నీళ్లు పోసావా !”

“లేదండి”

“సరేలే నేను పోస్తాను” అంటూ నీరు తీసుకొని మిద్దె పైకి ఎక్కుతూ ఉన్నాను.

**“ఏవండి ! మీకి రాను రాను మతిమరుపు ఎక్కువ అవుతుంది, ఆ టీ గ్లాసు అక్కడ పెట్టి వెళ్ళిపోతున్నారు ఇదిగో తీసుకోండి”.**

“ఆ సరే... సరేలే” అంటూ పైకి ఎక్కాను.

“ఆహా ! నా చెట్లు చాలా బాగా పెరిగినాయి. చిగురు చూడు ఎంత పచ్చగా వచ్చింది, చాలా అందంగా వున్నాయి. వీటిని ఇంకా బాగా పెంచి కింద మట్టిలో నాటుదాం అనుకుంటూ గోడ మీద కూర్చున్నాను. అబ్బా ! ఈ కాకులు ఎందుకు ఇంత గట్టిగా అరుస్తున్నాయి. అనుకుంటూ చుట్టు పరీక్షించాను. ఏదో కాకి చనిపోయినట్లుంది గిర్రుగిర్రున తిరుగుతూ ఉన్నాయి. చాలా కాకులు కరెంటు పోల్ మీద కూర్చుని అరుస్తున్నాయి. కొన్ని కాకులు ఆకాశంలో నుంచి కిందికి దిగుతూ ఉన్నాయి.

అప్పుడే రెండు తెల్లకొంగలు ఆకాశంలో ఎగురుతూ వస్తున్నాయి. ఆహా ! ఎంత బాగున్నాయి కొంగలు. కదండి అంటూ వచ్చింది నా భార్య.

“ఆ ! అవును అవి వేరే దేశాల నుంచి మన దేశానికి వలస వస్తున్నాయి”

“అవునే” “వాటిని చూస్తుంటే చిన్నప్పుడు కూడ అలాంటివే చూసినట్టు గుర్తు. కాదు కాదు... చిన్నప్పుడు పేపర్‌లో కథలో ఆ అందమైన బొమ్మ చూశాను. అచ్చం అలానే ఉన్నాయి”.

“ఏమిటి నువ్వు నీ చిన్నప్పుడు పేపర్ చదివేదానివా అంతలేదు”

“మీరు అలామాట్లాడితేనే నాకు కోపం వచ్చేది. ఏమీ నాకేం తక్కువ, పేపర్ చదువుకోకుండా వుండడానికి, మేము పేపర్ తెప్పించే వాళ్ళం.

“మా ఆవిడకు కోపం వచ్చినట్లుందే, బుంగ మూతి పెట్టింది” అంటూ గడ్డం పట్టుకున్నాను.

“వీటికేమి తక్కువలేదు”

“సారీ... సారీ... ఇదిగో ఇటు చూడు, నువ్వు ఆ కథ చదివింటే నాకు చెప్పు అంతే కదా”.

నేను ఆ కథ చెప్పాలంటే ఒక షరతు. “ఏమిటది” “మీరు నాకు చీర కొనివ్వాలి సరేనా”.

ఇప్పుడు కొనివ్వను అంటే నువ్వు నన్ను వదిలిపెట్టవు కదా. మొదట నువ్వు కథ చెప్పు అప్పుడు చూద్దాం”.

“సరే వినండి”. “కొడుకు కొంగని ఎక్కడికిరా బయలు దేరుతున్నావు” అంది అమ్మ.

“నేను వలస వెళుతున్నాను అమ్మా”

ఇక్కడే ఉండి బతకవచ్చు కదురా, ఎందుకు వలస వెళ్ళటం ఇక్కడే ఉండు” ఉన్నదాంట్లో తిని బతుకుదాం.

“లేదమ్మా నేను వెళ్ళాలి, ఎంతమంది వలస వెళ్ళుతున్నారు చూడు, నేను వెళుతున్నా, నువ్వు చెప్పేది నేను వినను అమ్మా !

“సరే జాగ్రత్తగా వెళ్ళు నాయనా, ఎవరితోనూ గొడవ పడకు, మంచిగా ఉండాలి సరేనా”

“ఆ సరే... సరే...” అలా సముద్రం ప్రయాణం చేసి “ఇంకొద్ది క్షణాలలో ఒడ్డుకు చేరబోతుంది, యాహూ ! చాలా సంతోషంగా ఉంది” ఆహా ఎంత చల్లని గాలి ఎంత మంచి సముద్రం బాగా ఉందే, ఆ సముద్రంలో ఒక బోటు ఉంది. ఎందుకు ఖాళీగా ఉంది అనుకుంటూ ముందుకు కదిలాను.



“కాపాడండి ! కాపాడండి అంటూ అరుపులు వినబడ్డాయి

చుట్టూ చూశాను, ఎక్కడ ఎవరు కనబడలేదు. అలాగే ముందుకు వెళ్ళుతున్నాను”.

“మళ్ళీ కాపాడండి ! కాపాడండి అంటూ అరుపులు, ఆ అరుపులు

ముందు నుంచే వస్తున్నాయి. ఎవరో అని వేగంగా ముందుకెల్లుతున్నాను.

“అవును నిజమే” అది ఒక కొంగ సముద్రంలోకి పడిపోతుంది. నేను వేగంగా కిందికి ఎగురుతూ వెళ్ళుతున్నాను. దగ్గరికి వెళ్ళుతున్నకొద్ది దానిని ఎక్కడో చూసినట్టుందే అనుకుంటూ సముద్రంలోకి పడిపోకుండా దానిరెక్క పట్టుకొని ఇందాక కనిపించిన ఓడ దగ్గరకు తీసుకువచ్చాను.

“ఎక్కడో చూసినట్టు ఉందే, ఆ గుర్తు వచ్చింది, అది తన స్నేహితుడే. అది ఎంత వేగంగా ఎగరగలదు అంటే నిమిషాలలోనే మైల్లు దాటగలదు. ఆ కొంగ ఎంత ధృఢంగా ఉండేదంటే అసలు మా జాతిలో తనలా ఒకరంటే ఒకరు కూడా ఉండేవాళ్ళం కాదు. వాడిలాగ ఎగరలేక పొయ్యే వాళ్ళం.

అది గంభీరమైన అడుగులతో అందరిని ఆకర్షించేది. తన ఈకలు ఎంత పొడవుగా ఉండెవో. తనకు ధైర్యం కూడ చాలా ఎక్కువే. ఆకాశంలో ఎప్పుడు గింగిరాలు కొట్టేది. చేపలని ఎంత నైపుణ్యంతో పట్టి తినేది. తన ముక్కు ఎంత పొడవుగా ఉండేదో.

ఎప్పుడు ఉషారుగా ఉండి ఏ జీవికి ఆహారం అయ్యేది కాదు. అందరికి సహాయం చేసేది కూడ, తమ జాతి వాళ్ళు ప్రతి సంవత్సరం ఎవరు వేగంగా ఎగురుతారోనని పోటీ పెట్టేవాళ్ళు. అందులో ఎప్పుడూ అదే నెగ్గేది, దానికి మా దీవిలో మంచి పేరు ఉంది. “కిందటి సంవత్సరం ఆ కొంగ మా దివి నుంచి వలసకు బయలుదేరిందని ఎవరో చెప్పుతుంటే విన్నాను.

“మిత్రమా ! ఏమిటి నువ్వు ఇలా అయిపోయావు. నువ్వు ఎలా ఉండేవాడివి ఇలా అయిపోయావేమిటి, బాగా నీరసంగా ఉన్నావు. చూస్తుంటే ఆకలితో ఉన్నట్లు ఉన్నావు. ఈకలు చూస్తే చాలా వరకు రాలిపోయాయి ముక్కు చూస్తే వంగిపోయింది, కాళ్ళ గోర్లు వంగిపోయాయి, చాలా బక్కగా అయిపోయావు, అంత వేగంగా ఎగిరేదానివి ఎందుకు ఎగరలేకపోవుతున్నావు ?”

**“నేను మన దీవిని వదిలిపెట్టి ఈ దేశానికి వచ్చాను. రోజు గాలిలో ఎగరడం, ఆహారం వెతుక్కోవడం చేశాను. మొదట్లో అక్కడ...అక్కడ ఆహారం దొరికింది. కానీ రోజు ఎక్కువ సేపు గాలిలో ఎగురుతుండడం వల్ల కళ్లు బైర్లు కమ్మాయి, రానురాను కళ్ళు సరిగ్గా కనబడడం లేదు,** రెక్కల ఈకలు ఊడిపోతున్నాయి. ఆహారం వెతుక్కోవడం కష్టం అవుతుంది.

మనం మన దీవుల్లో ఉన్నపుడు ఎంతసేపు గాలిలో ఎగిరినా ఏమైయేది కాదు. ఇప్పుడు ఏమైంది అని ఆలోచించా. అలా ఆలోచిస్తూ ఆకలితో వుండలేం కదా, ఆహారం కోసం ఎగురుతూ వెళ్తున్నాను. అప్పుడు కనబడ్డాయి ఆలాంటి మేఘాలు ఎప్పుడూ చూడలేదు. అదం తా ఒక గొట్టం నుండి బయటకి వస్తుంది. అప్పుడు అర్థం అయింది ఇదంతా ప్యాక్టరీలవల్ల అని.

చాలా మంది మనవాళ్లు ఆ గాలికి జబ్బుపడ్డారు. కొంతమంది మరణించారు అని తెలిసింది. నాకు ఈ మానవునిపైనా చాలా కోపం వచ్చింది. తన సౌకర్యాలు తీర్చుకోవడం కోసం మనం అందరి ప్రాణాలు ఆ వాయువుల వల్ల పోతున్నాయి.

మన జీవులు ఒకటే కాదు ఆ ఫ్యాక్టరీలో పని చేసే మనుషులు ఎం తోమందికి అనారోగ్యాల తో మంచాన పడుతున్నా రు. ఆ పొగ వల్ల ఎ న్నో రకాల జబ్బులు సంభవిస్తున్నాయి. ఇంకా ఈ వాహనాల వల్ల గాలి



కాలుష్యం పెరిగిపో తుంది.

మన భూమండల ఉష్ణోగ్రత రోజు రోజుకు పెరిగిపోతుందట, మన భూమి తల్లిని మనమే నాశనం చేసుకుంటున్నాము. రోజూ ఎన్నో చెట్లను నరికేస్తున్నాము. మనం అంటే వేరేచోటు నుంచి వస్తున్నాం. కాని ఇక్కడ జీవుల ప్రాణాల కోసం విలవిలలాడుతున్నాయి. ఎన్నో చిన్న చిన్న పక్షులు ఫోన్ నుంచి వచ్చే రేడియేషన్‌ని తట్టుకోలేక మరణిస్తున్నాయి. గ్రద్ద మామలు, డేగ మామలు ఎప్పుడో కనపడేది అవి చాలా వరకు నాశనం అయ్యాయి.

ఆ కాలుష్యంలో ఎక్కువగా కర్బనం ఉండడం వల్ల ఉష్ణోగ్రత పెరిగి ధృవ ప్రాంతాలల్లో మంచు కరుగుతుంది. దానివల్ల భూమిపై నీరు పెరుగుతుంది. అలా పెరగడం వల్ల చాలా జీవులు, చాలా దేశాలు నీటిలో మునిగిపోతాయి.

“ఆ పొగ వల్ల మనమొక్కటే కాదు జలరాశులు, భూమిపై జీవులు కూడా చచ్చిపోతాయి. ఆ వాయు కాలుష్యం వల్లే నాకూ ఇలా జరిగింది. మనం దీవిలోనున్న చెట్లు కూడా అక్కడ లేవు”.

**“ఇంత ప్రమాదం ఉన్నచోట బ్రతకటం అవస రమా ? మన వారందరిని పిల్చుకొని మన దీవికి వెళుదాం పద”**

అంటూ వాళ్ళ దీవికి వెళ్ళిపోయాయి కొంగలు.

“ఇప్పుడు చెప్పండి కథ ఎలా వుంది, ఇప్పుడు ఒప్పుకుంటారా నేనే గొప్ప అని”

“ఆ సరేలే... సరేలే...”

“మరి నా చీర ఖచ్చితం కదా”

“నేను కొనివ్వను అంటే వదులుతావా నువ్వు ? పదపద కిందికి పద ఇంటిలోకి వెళ్దాం”

“మామయ్యగారు భోజనం చేద్దురు రండి” అంది కోడలు.

“ఆ వస్తున్నానమ్మా” అంటూ భోజనం దగ్గరికి వెళ్ళి కూర్చున్నాము. “ఆహా నా కోడలు పిల్ల ఎంత బాగా చేసింది” ఈ రోజు కడుపు నిండా తిన్నాను. ఈ రోజు చాలా బాగా చేశావమ్మ అంటూ చేతులు కడిగేశాను.

×××

“అవునా ! మామయ్య నిజంగా బాగా చేశానా”

“నువ్వు మీ అత్తయ్య కంటే బాగా చేశావమ్మా, రేయి పద” అంటూ మనవడిని పడుకోబెట్టడానికి తీసుకువెళ్ళాను.

పరుపులు చాలా మెత్తగా ఉండడంతో నా మనవడు వాటి మీద ఎగురుతూ ఉన్నాడు. ఎగరొద్దు కింద పడితే నడుములు ఇరుగుతాయి.

“ఏమి కాదులే తాత నువ్వు పడుకో”.

“మీ అమ్మ వచ్చిందంటే తిడుతుంది పడుకో”

“మా అమ్మ ఏమి తిట్టదు చాలా మంచిది”.

“నువ్వు పడుకుంటావా లేదా ? ఎందుకు మీ తాతయ్యను విసిగిస్తున్నావు అంటూ వంట గదిలో నుంచి అరుపు విన్పించింది.

వంట గది వైపు చూసి మరి మనవడి కళ్ళు చూశాను.

“నవ్వుతూ ! ఏమిరా మీ అమ్మ తిట్టదు అన్నావే, అలా ఒకసారి అరిస్తేనే కుక్కపిల్లలా ముదురుకొని పడుకున్నావు”

“అంతా నీ వల్లే తాతయ్య” అంటూ బుంగమూతి పెట్టాడు. “పో తాతయ్య నేను నీతో మాట్లాడను” అంటూ పక్కకు తిరిగి పడుకున్నాడు. నేను వాన్ని పక్కకు జరుపుతూ వాడి పక్కన పడుకున్నాను.

“తాతయ్య”

“ఆ ఏమి చెప్పు”

“తాతయ్య నాకు... నాకు...”

“నువ్వు నాతో మాట్లాడనన్నావు కదా ?”

“సారీ తాతయ్య”

“నేను ఇప్పుడు నీతో మాట్లాడను” అన్నాడు తాతయ్య.

“ఆ మొదలెట్టారా తాత మనవళ్ళ బుంగమూతులు, రోజు ఇదే తంతు”

“మీరేమో వాన్ని తిట్టడం, వాడేమో బుంగ మూతి పెట్టడం మళ్ళీ వాడు మీతో మాట్లాడడం, మళ్ళీ మీరేమో బుంగమూతి పెట్టడం చూడలేకపోత ున్నాం” చిరునవ్వు బుగ్గలమీదకు తెస్తూ.

“తాత కథ చెప్పవా”

“నేను నీతో మాట్లాడను”

“తాత నువ్వు కథ ఎలా చెప్తావో నాకు తెలుసుగా” అంటూ గడ్డం పట్టుకున్నాను.

“నేను కాదు, ఈ రోజు నువ్వు కథ చెప్పాలి, నువ్వు కూడా ఎన్నో కథలు చదివింటావు, వినింటావు కదా ! నా కోసం ఒక కథ చెప్పు”.

“పో తాతయ్యా నాకు రావు”

“నువ్వు కూడ కథ ఎలా చెప్పుతావో నాకు తెలుసు కదా” అంటూ గడ్డం పట్టుకున్నాడు.

“సరే తాత విను”

“ఏమేయ్ ! పొలానికి వస్తావా”

“రాను అయ్య, రేపు వస్తాలే”

“సరేలే ఈ రెండు ఎద్దులను తీసుకుపోతున్నా పొలానికి”

“కాదయ్యా ! ఆ ముసలి ఎద్దును కూడ తీసుకువెళ్ళచ్చు కదయ్య”

“అదేమి పనిచేస్తుంది. పనికి రాని ఎద్దు. తింటూ ఉండడం తప్ప”, అది ఎప్పుడు ఇట్లో పడుకోవడం ఆ దొడ్లో అటు ఇటు తోక ఊపుతూ, తన మీద ఉన్న ఈగలను, దోమలను చంపడం తప్ప.

ఇక ఆ మూతిని నాలుకతో శుభ్రం చేసుకొంటు వుంటది. లేకపోతే బండలకి, గోడలకి, చెట్టుకి తన వీపును రుద్దుకుంటుంది, ఆ పేడను వేసి రచ్చరచ్చ చేస్తుంది”.

“ఇప్పుడు మీరు తీసుకెళ్తారా లేదా ! అని ఇంట్లో



నుంచి అరుపు వినబడింది”

ముసలి ఎద్దును కూడా చేనుకి తోలుకెళ్ళుతున్నాను...

హేయ్ పా..పా... అంటూ రెండు దెబ్బలు వేసి లేపాడు ఎద్దుని. అది బాధతో మూలుగుతూ లేసింది. ‘పా’ అంటూ ఇంటి నుంచి బయటకు పంపించాడు. “పదండి” అంటూ పొలం దగ్గరకు ముసలి ఎద్దుతో పాటు మిగతా ఎద్దులను కూడా పొలానికి తోలుకొనిపోయాడు.

“నేను ముసలి ఎద్దును. కనుక నన్ను పక్కకు తోలాడు. నేను రైతుని నా దేవుడిగా భావించాను. ఆయనకు నేనేమి తప్పు చేశాను.

పొలం ఎంత గట్టిగా ఉన్నా సరే ఆగకుండా ఎంత తొందరగా పూర్తిచేసేదాన్ని, వచ్చిన పంటని ఎంత బరువున్నా కాదనకుండా. మార్కెటుకు తరలించెదాన్ని. వాళ్ళ ఇంట్లో పెళ్ళి ఉన్నపుడు. గిన్నెలు, సరుకులు, నీల్లు ఎన్నెన్నో ఎంత బరువున్నా తీసుకువచ్చేవాడిని. కానీ ఇప్పుడు నా వల్ల ఏమోతుంది ఏమీ చేయలేను. కదా ముసలిదాన్ని.

నా కాళ్ళు పనిచేయుడానికి వెళ్తే ముందుకు వెళ్ళకుండా పట్టుకొనిపోతాయి. నా వీపు నొప్పిగాఉంటుంది. మెడ ఆ కాడిమాను మోయలేక తలవంచేస్తుంది. ఈ పొలం ఎంతదూరం ఇంటికి, పొలానికి తిరగడం నా వల్ల కావట్లేదు.

నా దేవుడు నన్ను కబేళా కు పంపిస్తానని అంటున్నాడు. ఈయన నేను పనిచేయగలిగిన రోజుల్లో కాలు మీద కాలేసి దర్జాగా బ్రతికాడు. రొమ్ము ఎత్తుకొని తిరిగారు. నేను బండిలాగు పందెంలో గెలిస్తే అందరి ముందు మీసం తిప్పడం ఎన్నిసార్లు చూడలేదు.

పనిచేసి వచ్చినప్పుడల్లా “తిను తిను” అంటూ పెట్టేవాడు కాని ఇప్పుడు “చస్తే చచ్చిందిలే ఏ పనికి ఉపయోగపడడం లేదు, ఎందుకు పెట్టాలి ?” అని అనుకుంటున్నాడు.

నేను పనిచేయకుండా ఉంటే ఇప్పుడు ఇలా దర్జాగా ఉండేవారా ? నాకు ఎంత కోపం అంటే, ఈ మనిషిని కాళ్ళకింద వేసి తొక్కే యాలని, లేకుంటే పొడిచేయాలన్నంత కోపం.

అప్పుడే ఆ చెట్ల నుంచి చల్లని గాలి వీచింది. ఆ గాలికి సీతాకాకోకచిలుక వచ్చి నా ముక్కు మీద వాలింది.

“నువ్వు ఆలోచిస్తున్నది తప్పు”

“అయినా నా గురించి నీకేమి తెలుసునని తప్పు అని చెప్పుతున్నావు. ఒకసారి తుమ్మితే చాలు ఎక్కడపడతావో”

“అదిగో ఆ పూల మీద ఇంతసేపు వాలి తేనెను తాగుతున్నపుడు నువ్వు అనుకుంటున్నది విన్నాను, నాకు ఏమి తెలియకపోయిన నువ్వు ఆలోచించడం మాత్రం తప్పే”.

“ఎందుకు తప్పు ? ఎలా తప్పు ? చెప్పు చూద్దాం” అని ముక్కు విధిలిస్తూ అన్నాను.

అది ఎగురుతూ కింద వున్న పువ్వు మీద వాలింది.

**“ఎద్దు అదిగో చూడు ఆ సూర్యుడు, ఆయన వల్ల నాకు ప్రాణం వస్తుంది. అలానే ఈ ప్రకృతంటికి ప్రాణం వస్తుంది”**

తను రాకూడదు అనుకుంటే, ఇవన్నీ మనిషి పుట్టకముందు నుంచే వున్నాయి కదా వీటికి వయసు మనకంటే ఎక్కువే కదా. ఇలా ముఖ్యమైనవే మేము పని చేయకూడదు మాకు వయసు అయిపోయింది అనుకుంటే, మనం భూమి మీదకు వచ్చేవాళ్ళమే కాదు కదా. వీటి ముందు నువ్వెం చేస్తున్నావు ఒక పది ఎకరాలను దున్నడానికి నువ్వు వున్నావు. సహాయం చేస్తున్నావు అంతే కదా !

అయ్యో ! నీకు చెప్పుకుంటూ నా పని మరిచిపోయేలా వున్నాను. నేను వెళ్ళి చాలా పువ్వులకు సహాయం చేస్తూ భవిష్యత్తునివ్వాలి వెళ్ళొస్తా అంటూ గాలికి ఎగిరిపోయింది సీతాకోక చిలుక.

**ఎద్దు తన యజ మానిని మనసులోనే క్షమిస్తూ,** ప్రకృతి ధర్మాన్ని అంగీకరిస్తూ ఆనందంగా మేతమేయడం ఆరంభించింది.

(సమాప్తం..)



నేటినిజం చందా వివరాలు
ప్రతి వారం ప్రచురిస్తున్న ‘సాహితీ కెరటాలు’ గల ‘నేటినిజం’ 260 సంచికలు + పోస్టల్ ఛార్జీలు కలుపు కుని **5** సం॥రాలకు రూ.**700/-**, **10** సం॥రాలకు రూ **1200/-** మీ చందాను ‘నేటినిజం‘ తెలుగు దినపత్రిక పేరిట ఎం.ఓ. లేదా డిడిగానీ, ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.
‘నేటినిజం’ దినపత్రిక, ఎస్‌ఆర్‌టి-74, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020.

## వేదా చంద్రయ్య రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభల చిత్రాలు
























# ప్రాతః స్మరణీయులు వేదా చంద్రయ్య

ఆధ్యాత్మిక వేత్త, తత్వదర్శి అయిన వేదా చంద్రయ్య గారి అమృత వాక్కులలోని ఒక్కో మాట అమృతగుళికలా మనోవి కారాలను అన్ని మానసిక రుగ్మతలను దూరం చేసేలా ఉన్నాయి. వీరి నిరంతర అధ్యయన చింతన సూక్ష్మ పరిశీలన, దయ క్షమ వంటి ఉదాత్తమైన లక్షణాలు మనకు ద్యోతకమవుతాయి.

నేను 'నాన్నగారు' అని అత్యంతగౌరవంగా పిలుచుకునే వీరు ..నన్ను తమ పుస్తకానికి ముందుమాట వ్రాయమ్మ అని అడగడం నాకు గొప్ప గౌరవంగా, ఆశీర్వాదంగా భావిస్తున్నాను. వారు పూర్తిగా అస్వస్థులై కూడా పడకమీదే ఉండి ఈ పుస్తకాన్ని పూర్తి చేశారు.

సాహిత్యం ఒక అభిలాష. రచనలు చేయాలనే తపన గలవారికి రాయనిదె నిద్రపట్టదు. సమాజంలోని ప్రతి అణువణువు కథావస్తువులే. కవి తన కలాన్ని ఖడ్గంగా మార్చి చెడును ఛేదించిన సంఘటనలు ఎన్నో..! సమాజహితంలో సాహిత్యం పాత్ర అనవరతమైనది. అలా చివరికి క్షణాల వరకు సాహిత్యాన్ని, రచనను ప్రేమించి, సమాజంపట్ల ప్రేమ కలిగి యువతరానికి అమృతోపేయమైన అమృతవాక్కులు అందిస్తూ మార్గదర్శనం చేస్తూ శరీరము పూర్తిగా సహకరించని స్థితిలో కూడా రచనలు చేసిన ఒక గొప్ప వ్యక్తి మానవతావాది, మృధుస్వభావి సంస్కారఝరి శ్రీ వేదచంద్రయ్య గారు.

వీరిమరణం సాహిత్యాభిమానులందరిని దిగ్భ్రాంతికి గురి చేసింది. 1939 శ్రావణ పౌర్ణమి కీర్తిశేషులు వేదా లక్ష్మయ్య -సత్యమ్మ దంపతులకు వీరు జన్మించారు. ఉద్యోగ విరమణ అనంతరం పూర్తి స్థాయి గా సాహితీ సేవ చేస్తూ వస్తున్నారు. శ్రీ అయ్యప్ప భక్త సమాజం మరియు వేద ధర్మ శాస్త్ర పరిషత్ వ్యవస్థాపకులు. 27 గ్రంథాలను ఆవిష్కరించారు. అమృతవాక్కులు 14 సంపుటాలు వెలువరించారు. 14వ సంపుటికి ముందుమాట రాసే భాగ్యాన్ని నాకు కలిగించారు సాహితీ ప్రపంచంలో నాకు పితృ సమానులు. వీరి మరణం తీరని లోటు. వేద ధర్మం, గేయాలు, ఆరోగ్య చంద్రిక, శ్రీ ధర్మ శాస్త్ర వేద శతకము, వేద గీతామృతం, గుడి నానీలు ఇలా... ధర్మం న్యాయం పద్యం సూక్తులు ఈనాటి యువతకు అందు బాటులో లేని ఎన్నో ఉపయుక్తమైన విషయాలను తనదైన శైలిలో అందరి ముందుకు తెచ్చారు. వీరి అమృతవాక్కులు నిజంగా వ్యక్తిత్వ వికాస బోధలు...! ప్రభాత కాలంలోనే వివిధ వాట్సాప్ గ్రూప్ ద్వారా మమ్మల్నిపలకరించేవి. ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు వీరి అమృతవాక్కులు. చంద్రయ్య గారు నడవలేని స్థితిలో కూడా ఎన్నో సాహితీ సభలకు విచ్చేసి మమ్మల్ని ఆశీర్వదించే వారు. ఆయనలోని సౌమ్య సరళ స్వభావం అద్భుతం. అంత వ్యక్తి కూడా ఎంతో ఒద్దికగా అందరి ఎడల దయగా వ్యవహరించడం నిజంగా అనుసరణీయం.పూర్తి అస్వస్థతకు గురైె శరీరము సహకరించని స్థితిలో 81 సంవత్సరాల వృద్ధాప్యంలోనూ సడలని సంకల్పం, సాహిత్యాభిమానం వారిచేత చివరి శ్వాసవరకూ రాయి ంచింది. 9 అక్టోబర్ 2019 తెల్లవారు జామున 2 గం॥ల ప్రాంతంలో శ్వాసకోశ ఇబ్బందితో వారు శరీరాన్ని వదిలేశారు. గత నాలుగు రోజులుగా పూర్తిగా రాయలేని స్థితిలో ఉండి కూడా రాయకుండా ఉండలేని వారి సంకల్పం ఎంతగా ప్రోద్భలం చేసిందంటే తన మనవరాలితో అమృతవాక్కులు పోస్ట్ చేయించారు వివిధ గ్రూపుల్లో ! సాహితీ పిపాస కలిగిన ఎందరికో దిశానిర్దేశకులు. సామాజిక స్పృహ, ధర్మరక్షణ యెడల అనురక్తి, కొత్తతరానికి పెద్దదిక్కుగా.. తన నడవడి ద్వారా ప్రేరణనిచ్చిన వీరి లోటు భర్తీ చేయలేనిది. రాయడం వేరు ఆచరించి రాయడం వేరు.

## ముద్రిత గ్రంథములు

1) యాద వంశం నాడు నేడు - నవంబర్ 2012
2) ఆరోగ్య దీపిక - డిసెంబర్ 2012
3) శ్రీ అయ్యప్ప క్షేత్రం - ఆగష్టు 2013
4) అమృత వాక్కులు 1- ఆగష్టు 2013
5) శ్రీ ధర్మశాస్త్ర గేయమాలిక 1- నవంబర్ 2013
6) అమృత వాక్కులు 2 - మార్చి 2014
7) శ్రీ ధర్మశాస్త్ర గేయమాలిక 2 - మార్చి 2014
8) అమృత వాక్కులు 3 - ఆగష్టు 2014
9) ఆరోగ్య చంద్రిక - అక్టోబర్ 2014
10) అమృత వాక్కులు 4 - అక్టోబర్ 2014
11) శ్రీ ధర్మశాస్త్ర గేయమాలిక - అక్టోబర్ 2014
12) అమృత వాక్కులు 5 - జనవరి 2015
13) శ్రీ ధర్మశాస్త్ర వేద శతకము త్రిశతి - ఫిబ్రవరి2015
15) శ్రీ ధర్మశాస్త్ర వేద శతకము త్రిశతిత్రిశతి-2
16 శ్రీ ధర్మశాస్త్ర వేద శతకము త్రిశతిత్రిశతి-3
16) అమృత వాక్కులు 6 - జూలై 2015
17) అమృత వాక్కులు 7 - అక్టోబర్ 2015
18) అమృత వాక్కులు 8 - డిసెంబరు 2015
19) అమృత వాక్కులు 9 - మే 2016
20) గుడి నానీలు - ఆగష్టు 2016
21) వేద గీతామృతము - డిసెంబరు 2016
22) అమృత వాక్కులు 10 - జనవరి 2017
23) అమృత వాక్కులు 11 - డిసెంబరు 2017
24) వేద పరిమళాలు - డిసెంబరు 2017
25) అమృత వాక్కులు 12 - జూలై 2018
26) అమృత వాక్కులు 13 - మార్చి 2018
27) అమృతవాక్కులు 14 - ఆగష్టు 2019

## వేదామృతం వీరి అంతరంగం

### వ్యక్తిత్వ వికాసాలు - వేదా గారి అమృత వాక్కులు

ఒక మంచి మాట ఒక చల్లని పలకరింపు ఒక అద్భుతమైన పుస్తకం చేసే మేలు సాటి మరేదీ ఉండదు. వేద ధర్మశాస్త్ర పరిషత్ సంస్థాపక అధ్యక్షులు, కవి, రచయిత, శ్రీ వేదా చంద్రయ్య **“అమృత వాక్కులు”** అలాంటి ఒక అద్భుతమైన గ్రంథం.కర్మ సిద్ధాంతాన్ని నమ్మిన సాహిత్యం ఎడల వారికున్న తపన ,భావితరాలకు దిశా నిర్దేశనమంటి పుస్తకాలు అందిం చాలనే సంకల్పం చాలా గొప్పది.

ఎన్నెన్నో గొప్ప గొప్ప గ్రంథాలను , వేదాలను చదివి ఆణిముత్యాలన్నిటిని ఏరి కూర్చి “అమృత వాక్కులు” అనే మాలగా కట్టి పదునాల్గు మణిమాలలను మనకందించారు. ఒక్కోటి ఒక భగవద్ గీత! వ్యక్తిత్వవికాస శిక్షణా గ్రంథాలు!!

ఓంకారం విశిష్టతను కూలంకుషంగా వివరించారు. ప్రపంచానికి సంబం ధించిన విషయాలు, ఆధ్యాత్మికత, మానసిక పరిప క్వత ,ఈర్ష్యాద్వేషాల ఫలితం ఇలా అన్ని కోణాలను చూపించారు. “ మన దేశ నాగరికతను గుర్తిం చాలంటే వెళ్ళవలసింది ముందుకు కాదు, వేల ఏండ్ల వెనక్కి” అంటారు “ఒక్క నిజం కొద్దిసేపు బాధించవచ్చు కానీ ఒక్క అబద్ధం జీవితాంతం వేధిస్తూ ఉంటుంది” అంటారు.

“ఏది వేదమో, అదే ధర్మం ఏది ధర్మమో అదియే సరైన మార్గం” “అదృష్టం వాన నీరు లాంటిది ,శ్రమ బావి నీరు లాంటిది “ “ ప్రశాంతమైన మనస్సే ఒక తిరుగులేని ఆయుధం “ “ భావాలు విత్తనాలైతే పనులు వృక్షాలవుతాయి” ఇలా ఎన్నో ఎన్నెన్నో గొప్ప వాక్యాలు. జీవితంలోని ఎన్నో ప్రశ్నలకు సమాధానాలుగా ..!!!

ఇంకొన్ని చురకలవంటి అమృత వాక్కులు “ చెట్టు నిండా పండ్లు ఉన్నా మాగిన పండు దగ్గర చిలుక, కుళ్ళిన పండుదగ్గర పురుగు ….అలాగే మంచి చెడుల సమూహం మన చుట్టూ …”మంచి వ్యక్తుల సాంగత్యం గురించి ఎంత చక్కని ఉదాహరణతో కూడిన మాట ఇది.”సముద్రం లో అలలు తగ్గాక స్నానం, వృద్ధాప్యం వచ్చాక జ్ఞానం”. రెండు కానిపనులు” “ప్రతి మహారాజు ఏడుస్తూ పుట్టిన వారే ! ప్రతి మేడ ఒకప్పుడు బ్లూ ప్రింటే నీవు ఇవ్వాళ్ళ ఎక్కడున్నావన్నది కాదు, రేపు ఎక్కడికి చేరుతావన్నది ముఖ్యం” highest phycological lines !!

మనిషి జీవితసానికి అడుగడుగునా ఉపయోగపడే, మార్గదర్శుల వంటి గురువుల సమాహారం ఈ వాక్యాలు. మాటలో మధురిమ నిజాయితీ ఉండాలని చెప్పే గుళికలు కొన్ని “ శరీరానికి గుచ్చుకున్న బాణాలను నేర్పుగా తీయవచ్చును, కానీ మనసుకు తగిలిన వాటిని తీయలేము” “ గొడ్డలితో చెట్టును నరికితే మళ్ళీ చిగురిస్తుంది కానీ, మాటలతో కార్యం చెడితే మళ్ళీ చిగురించడం కష్టం “ “ స్నేహ -విరోధాలు, గౌరవ- అగౌరవాలు , ఉన్నత -అధోగతులు మన మాట తీరుపైనే ఆధారపడి ఉంటా యి- జాగ్రత్త”. “ 95% సమస్యలు మనమాటతోనే వస్తాయి. అవి నీవు ఏమి చెబుతున్నావు అని కాదు, ఎలా చెబుతున్నావు అనేది ముఖ్యం “ ..!

ఈ మాట ఒంటబట్టించుకుంటే చాలా సంస్థల్లో కుటుంబాలలో మనః స్పర్థలుగొడవలు సద్దుమణిగి పోతాయి.

భగవద్గీత ప్రపంచంలోనే గొప్ప వ్యక్తిత్వ వికాస గ్రంథం. అలాగే ఎన్నెన్నో పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు, ఉపనిషత్తులు ..గొప్ప గొప్ప గ్రంథాలు .అవన్నీ సామాన్యులకు అర్థమవ్వడం కష్టం. వాటిలోని సారమంతా సులభమైన వాక్యాలలో మనకు అందించారు చంద్రయ్య గారు.

ఇరవైఏడు గ్రంథాల రచయిత చంద్రయ్య గారు. తమ వేద ధర్మశాస్త్ర పరిషత్ ద్వారా ఎన్నో సత్కార్యాలను చేశారు. ఎందరో భావుక కవులకు దిశా నిర్దేశకులు వీరు. నిరంతన అధ్యయన శీలి, సరళ సౌమ్య స్వభావి

ఈ అమృత వాక్కులు స్కూల్ మరియు కాలేజీ విద్యార్థులకు ,యువతకుచాలా ఉపయుక్తంగా ఉంటుంది అని ఒక ప్రిన్సిపాల్‌గా గట్టిగా చెప్పగలను. అంతే కాక యువ జంటలకు, ఆబాల గోపాలానికి అందరికి ఉపయోగ పడే గీతా సారమంటి పుస్తకాలు అమృతవాక్కులు

### అమృతాన్ని ఒడిసిపట్టిన స్వర్ణ కలశం విజయలక్ష్మమ్మ

వేదా చంద్రయ్య గారి ధర్మపత్ని శ్రీమతి విజయలక్ష్మి తన 13 ఏట భర్త అడుగులో అడుగు వేసి శీల కుటుంబం నుంచి వేదా కుటుంబం లో అడుగుపెట్టింది. ఆయన కలం అయితే ఈవిడ సిరా చుక్కగా మారింది

“ఉద్యోగరీత్యా మీ నాన్నా చాలా ఊర్లు తిరిగేవారు నేను నలుగురు పిల్లల్ని పెట్టుకొని పొలం పనులు చేయించేదానినమ్మా” అని చెప్పారు. అంతే కాదు అమ్మ కాటన్ మిల్‌ని కూడా సమర్థవంతంగా నడిపారు. అమ్మ మాటల్లో చేతల్లో ఆత్మవిశ్వాసం, తనపైన తనకు నమ్మకం తొణికిసలాడుతుంటుంది. అమ్మా నువ్వేమి చదివావు ప్రపంచాన్నా అని అడిగితే “మీ నాన్ననే నా ప్రపంచమమ్మా” అని చెప్పేసారు.

పదవి విరమణ తరువాత పూర్తి స్థాయి సాహిత్యసేవకు అంకితమయ్యారు. సినారె నందిని సిద్ధారెడ్డి వంటి సాహితీ దురంధరులతో సభను పంచుకున్నారు. ఆక్సిడెంట్ వలన కాలు సరిగ్గా సహకరించేది కాదు. అమ్మను తోడు తీస్కొని ప్రతి సభకు వచ్చేవారు. మరణానికి సుమారు నాలుగు నెలల ముందు వరకు కూడా సాహితీ కార్యక్రమాలకు వచ్చేవారు. “అమ్మా నీకు కూడా ఈ సభలు ఇష్టమా? “ అని అడిగితె..

“నాకు ఇష్టమో అయిష్టమో అన్నది ముచ్చట కాదు బిడ్డా… ఆయనకు ఇష్టం ఆయన ఆరోగ్యం చూసుకోవాలి నడవడానికి ఇబ్బంది. దమ్ము మనిషి అందుకే నేను వెంట పోయేదాన్ని” అన్నారు.

ఇది కదా సాంగత్యమంటే ! ఇది కదా దాంపత్యమంటే !! నిజంగా అతని సాహిత్యాభిలాషకు పట్టుగొమ్మ ఈ అమ్మ.

ఆ అమృతాన్ని ఒడిసిపట్టుకున్న స్వర్ణ కలశం విజయలక్ష్మమ్మ. “పుస్తకాలు రచనలు, సాహితీ చర్చలు చంద్రయ్య గారి శ్వాసగా ఉండేవి. అందుకే చివరి శ్వాసవరకు దానితోనే ఉన్నారు.

### పరిపూర్ణ మానవుడు- ఎ కంప్లీట్ మ్యాన్ వేదా చంద్రయ్య

నాకు తెలిసి నేను వీరికుటుంబంతో మాట్లాడి, చంద్రయ్య గారితో ఉన్న అనుబంధంతో తెలుసుకున్న విషయాలు….నాన్నగారి వ్యక్తిత్వం పైన ఆయన కుటుంబ నిర్వహణపైన ఇంకా గొప్పగా గౌరవాన్ని పెంచాయి. తనకిష్టమైన సాహిత్యాన్ని ప్రేమించారు. ఉద్యోగంలో ఉండగా సినిమా ఫక్కీలో గుడుంబా పండించే ముఠాని పట్టుకున్నారు. పల్లెల్లో ఒక అనామకుడి వేషధారణలో తిరుగుతూ రెక్కీ నిర్వహించి ముఠాగుట్టు రట్టు చేశారు. ఈ విషయం విజయలక్ష్మమ్మ చాలా గొప్పగా చెబుతుంది తన భర్తగురించి. ఎంతటి ప్రేమను అందించి ఉంటారాయన తన సహధర్మచారిణికి. 1989లో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని సాహితీ సేవకు శ్రీకారం చుట్టారు. ఆధ్యాత్మిక చింతనతో కలిగిన సంకల్పంతో తన వ్యవసాయ క్షేత్రం లో అయ్యప్ప దేవాలయం కుటుంబ సభ్యుల సహకారంతో నిర్మించారు అయ్యప్ప స్వామి భక్తుడైన చంద్రయ్య గారు స్వామివారి సేవలో శాశ్వత అధ్యక్షుడిగా అయ్యప్ప భక్త సమాజంకి చివరి శ్వాస వరకు సేవలు అందించారు. ఈయనకు ఒక కొడుకు ముగ్గురు కూతుళ్ళు. కుమారుడు వేదా సంపత్ కుమార్ భార్య రాజేశ్వరి, పెద్ద కూతురు పద్మ భర్త వెంకటేశ్వర్లు, రెండవ కూతురు రాధ భర్త మాధవ కుమార్, మూడవ కూతురు శ్రీదేవి భర్త వెంకటేష్, మనవళ్ళ మనవరాళ్లతో నిండైన కుటుంబం వీరిది.అందరూ విద్యావంతులు, సంస్కారవంతులు. తండ్రి ఆశయాలను ఆలోచనలను గౌరవిస్తూ ఆయనకు చేదోడువాదోడుగా ఉండడం గమనార్హం. మనవరాళ్లు చిరంజీవి అలేఖ్య అపూర్వలు తాతగారికి ఆయన అనా రోగ్యంతో రాయలేని స్థితిలో ఉంటే వీరు రాసి పెట్టేవారు. చంద్రయ్య గారి అమృత వాక్కులు ఎన్నో వాట్సాప్ గ్రూపులకు సుప్రభాతం సూక్తులై మేల్కొల్పేవి. విదేశాలలో ఉన్న ఇతని మనవరాళ్ళు మృధుల, హరిణిలు కూడా తాతయ్య సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని సంకల్పంతో ఉన్నారు.

చంద్రయ్య గారు తన పిల్లలకు కేవలం ఆస్తి నే కాదు సంస్కారాలను కూడా వారసత్వంగా ఇచ్చారు. ఇది నిజంగా కుటుంబ పెద్దలందరికీ ఆదర్శవంతమైన విషయమే కదా. జీవితంలోని తొలి దశలో ఎన్నో దక్కా మొక్కిలు తిని, తిరిగి తనను తాను నిరూపించుకుని సమర్థవంతమైన ఉద్యోగిగా, ప్రేమైక భర్తగా, ఆదర్శవంతమైన తండ్రిగా, గొప్ప ఆధ్యాత్మికవేత్తగా, సాహిత్యం ఎడల సంపూర్ణమైన అనురక్తి కలిగి చివరి శ్వాస వరకు మరణశయ్యపై కూడా రచన చేసిన ఆ సరస్వతీ మాత ప్రియ తనయుడు శ్రీ వేద చంద్రయ్య గారు!! వీరికి మరణం లేదు. మమతలో, మంచి తనంలో, పట్టుదలలో, అనురాగంలో, ఆధ్యాత్మికతలో, సాహిత్యంలోని ప్రతి అక్షరంలో వీరు ఉన్నారు. వీరు అమరులు. వేదా చంద్రయ్య గారు పరిపూర్ణ మానవుడు. ఏ కంప్లీట్ మాన్.

### ఆధ్యాత్మికత -వేద ధర్మ శాస్త్ర పరిషత్ స్థాపన

ఆధ్యాత్మిక భక్తి సామాజిక సాహిత్య సేవయే నా ఆశయం అంటూ తన జీవితాన్ని, జీవితాశయాన్ని పండించుకున్నారు.మహబూబ్ నగర్ జిల్లా కొత్తూరు మండలం గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో మే 17 1989న వినాయక ప్రతిష్టాపన చేశారు తదుపరి అయ్యప్ప స్వామిదేవాలయాన్ని నిర్మించారు.శ్రీ లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రమైన దిగువ యాదాద్రిలో పాత నరసింహ స్వామి ఆలయానికి వెడుత ంటే ఎడమవైపున ఉన్న శ్రీ శ్రీ బుచ్చిదాసు ఆశ్రమములో ఒక గది నిర్మాణానికి కావలసిన మూడు లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చి గదిని నిర్మించారు. ఈ మధ్య తన మరణానికి నాలుగు నెలల ముందు తన గ్రంథాలన్నింటినీ ఆశ్రమంలోని ఆ గదిలో లైబ్రరీ గా ఏర్పాటు చేయమని అందరికీ అధ్యయనానికి అందుబాటులోనికి తీసుకుని రమ్మని తన ముగ్గురు కూతుళ్లకు బాధ్యతను అప్పగించారు. భార్య ముగ్గురు కూతుళ్ల మనవరాలు అందరూ ఈ గ్రంథాలయానికి పుస్తకాలు చేర్చే పనిలో ఉన్నారు. నిజంగా గొప్ప కుటుంబం ఇది.

ధర్మము, న్యాయము, సామాజిక బాధ్యత అనే అంశాలను తన పిల్లలకు బోధిస్తూ వచ్చారు.

### మా నాన్నగారు ఒక ఓంకారం

“నాకు ఓంకారం సరిగ్గా పలకడానికి రావట్లేదు. ఓంకారం పలికితే ఇంకొన్ని ఏండ్లు జీవిస్తాను లేదా త్వరలో మరణిస్తాను” అని భార్య విజయలక్ష్మమ్మకు చెప్పారట. ఇది చెప్పిన కొద్ది నెలలకే తను శరీరాన్ని వదిలేశారు. మా నాన్నగారే నాకు ఓంకారం అని కుమిలిపోతూ చెబుతుంది తన కూతురు రాధ.సీస, కంద పద్యాలు అలవోకగా చెప్పే నాన్నకు మొదట్లో తెలుగు భాష పైన పట్టులేదు వ్యాకరణం తెలీదు. మాస్టార్ని పెట్టుకుని నేర్చుకున్నారు.ఎంతటి సాహితీ పిపాస.. ! రాయాలని ఎంత తపన!చంద్రయ్య గారిలోని మరో గొప్ప గుణం పనిని ప్రేమించడం. ప్రతి ఒక్కళ్ళు పని చెయ్యాలి ఎవ్వరు ఊరికే కూర్చొని తినొద్దు అని తన బిడ్డలకు నేర్పారు.

### గృహాన్ని అక్షరాలయంగా మార్చి…..!

చంద్రయ్య గారి గృహమే ఒక సాహితీ సభ. అది ఒక అక్షరాలయం. ఎన్నో సాహిత్య సమావేశాలకు, పుస్తకావిష్కరణలకు నికేతనము. వారి ఇల్లంతా మొదటి హాల్ అంతా పుస్తకాలతో అలంకరించబడి ఉంటుంది. ఆ ఇంట్లో కి వెళ్ళగానే పుస్తకాలు పలకరిస్తాయి. అధ్యయనానికి మన మనస్సును మళ్లిస్తాయి.

వారి ఎన్నో పుస్తకావిష్కరణలు స్వగృహంలోనే జరగడానికి విశేషం. ఎందరో ప్రముఖ సాహితీ వేత్తలు, పత్రికా సంపాదకులు ఇక్కడికి రావడం జరిగింది. అలా ఆ కుటుంబం వారసత్వంగా దీనిని అందిపుచ్చుకుంది. సంపదతో బాటు సాహితీ సంపదను పిల్లలకు పంచారు వీరు.

### నాన్నతో (వేదా నాన్నగారు అనే దాన్ని) నా స్నేహం

నాకు నాన్నగారితో ఉన్న అనుబంధం వయస్సు కేవలం రెండేండ్లే కానీ పితృ వాత్సల్యాన్నందించారు. వారి 14 వ సంపుటి అమృతవాక్కులకు ముందుమాట రాయమంటే నేను ససేమిరా అన్నాను, నాకంత అర్హత లేదు వేదా నాన్నా అంటే... లేదమ్మా నువ్వు రాయాలిఅని పట్టుబట్టి రాయించుకున్నారు.

నేను గొప్ప, నేనే గొప్ప, నాకే పేరు రావాలి అని అక్షరాలు కూడా సరిగ్గా అల్లలేని వారెందరికో వీరి నిరాడంబరత ఆదర్శమవ్వాలి.

వీరి ఆదర్శం ఆచరించి చూపినది అందుకే అనురణీయమైనది. అనారోగ్యమైన శరీరంతో కూడా నిర్మలమైన మనసుతో కలం కదపనిదే వారు ఒకరోజు కూడా గడిపే వారు కాదు. అలాగే రాస్తూనే చివరి శ్వాస విడిచిన మహనీయుడు. “ మంచం మీదే కూర్చొని రాస్కుంటున్నానమ్మా శరీరం మాట వినట్లేదు” అని నాన్నగారు చెప్పే మాటలు ఇంకా చెవులో వినబడుతున్నా యి. వీరిని ప్రాణం లేకుండా... మాటా పలుకు లేకుండా ఊహించలేను. ప్రతి వారం ఒకసారైనా ఫోన్ చేసి పలకరించడం. మంచి చెడులను విచారించడం. చేస్తున్న పనులను అడిగి తెలుసుకోవడం….అనురాగమూర్తి వేదా నాన్న గారు.

సాహిత్యానికి నిజమైన వారసులు వేద చంద్రయ్య గారు. ప్రతి అక్షరంలోనూ ప్రతి కవి స్పందనలోను వేద చంద్రయ్య గారు సదా జీవించి ఉంటారని ఆశిస్తున్నాను.

-రమాదేవి కులకర్ణి
8985613123


## తెలంగాణ రచయితల సంఘం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో..

డా॥ నందిని సిధారెడ్డి 'నూరుపూలు' ముందుమాటల ఆవిష్కరణ సభ

17.10.2019 సాయంత్రం 6 గంటలకు రవీంద్రభారతి, కాన్ఫరెన్స్‌హాల్, హైదరాబాదు.

ఆవిష్కర్త : కె. శివారెడ్డి
సభాధ్యక్షులు : డా॥ నాళేశ్వరం శంకరం
వక్తలు : డా॥ కాశీం, డా॥ గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి
ఆప్తవాక్యం : డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ వి.శంకర్
గ్రంథ సంపాదకులు : డా॥ బెల్లంకొండ సంపత్‌కుమార్
సభాసమన్వయం : కందుకూరి శ్రీరాములు, డా॥ తూర్పు మల్లారెడ్డి

మీరు ఈ సభకు తప్పక రాగలరు

- తెలంగాణ రచయితల సంఘం.



## యురేనియం...ఉరే నయం..!

అరణ్యమే జీవాయువు
సర్వప్రాణులకుస్నాయువు
యురేనియం పేరుతోన
పోసీకు ప్రాణవాయువు..!

యురేనియం మాకు వద్దు
మరణ దారి చూప రద్దు
పచ్చని మా బ్రతుకులోన
చిచ్చు విషం చిమ్మ వద్దు..!

కొండ కోన జలపాతం
అండనున్న మాప్రాంతం
చండాడే చపలతనా..
గుండెలు పగులు జీవితం..!

చెంచు జాతి మంచి గుణం
వంచన లేని ప్రేమ ఋణం
వెన్నెలాంటి సహృదయమె
వెన్నంటే త్యాగ ధనం..!

యూరేనియం త్రవ్వకాలు
జాలువార విషపు జాలు
జంతుజాల నాశనంబు..
ఆపితె అందరికి మేలు..!

యూరేనిమె దేశభక్ష
ఇరురాష్ట్రాలకే శిక్ష
పొరపాటేమైన మీరు
పెట్టగలర ప్రాణభిక్ష..!



–డా॥గన్నోజు శ్రీనివాసాచారి
8555899493,

## మార్పు..

మారుతున్న కాలంతో
మనంమారాలి....
తప్పదోయి.

మార్పు...
మననుండి ప్రారంభిద్దాం
భవిష్యత్తుకు
పునాదులు వేద్దాం.



–యెల్డి సుదర్శన్ పద్మశాలి
సెల్:9892411067

## విజయం లేని కాలం

కవుల కలాలు కవితలు పూస్తాయి
కనులు మాత్రం భీభత్స ప్రపంచాన్ని
కలలతో కప్పెడతాయి

ఒక్కపెన్నుపోటుతో
జీవితాల్లో ఉప్పెన ప్రవేశిస్తుంది
కాందిశీకులై కన్నీటినే తాగుతారు వారు...

వాహనాల వాకిళ్ళను
ప్రయాణీకుల లోగిళ్ళుగా మార్చే కార్మికులది
తొందరపాటా హక్కులబాటా
వెంటాడే సందేహం కన్నా
మాడిపోయే జీవితాలే భయపెడుతున్నాయి...

ఆశ్చర్యం...హక్కుల నోళ్ళకు తాళాలు
చిక్కుల చుక్కలే ఎటుచూసినా
కలల పూలను కాల్చే సంస్కృతి కాలంలో
కలాలను కాలరాయటం కొత్తేమీ కాదు...

విజయదశమి నిట్టూర్పులో విజయం ఆవిరైపోతుంది
నమ్మకాల శిఖరం ఒరిగిపోతుంది
చెమ్మలేని క్షణాలు చిక్కుముళ్ళై
పరిహసిస్తాయి...



–సి.యస్.రాంబాబు
9490401005

## మిస్సైల్ మ్యాన్....

ఆయన...
ఓ మహర్షి
ఓ మహా మనీషి
ఆ "వ్యక్తిత్వం" మానవీయం
ఆ "అస్తిత్వం" అనుసరణీయం

ఆయన...
ఓ శాస్త్రవేత్త
ఓ సాహితీవేత్త
ఆ "మాట" విజ్ఞాన పూతోట
ఆ "అడుగు" ఆదర్శాల బాట

ఆయన...
ఓ శ్రామికుడు
ఓ సాహసికుడు
ఓ అనితర సాధ్యుడు
ఆ "చూపు" కాంతి చార
ఆ "నవ్వు" నవ్య జీవధార

ఆయన...
ఓ నిత్య విద్యార్థి
ఓ సత్య బోధకుడు




ఆ "పలుకు" వరప్రసాదం
ఆ "ప్రవచనం" స్ఫూర్తిదాయం

కలలు కనండి సాకారం చేసుకొండంటూ
యువతకు ప్రేరణ నింపిన
నిలువెత్తు ఆత్మవిశ్వాస శిఖరం

అణ్వస్త్రాల దేశ అమ్ముల పొదిలో
పొదిగిన "మిస్సైల్" మ్యాన్

దేశ "ప్రథమ" పౌరునిగా జాతి కీర్తిని విశ్వవ్యాప్తం చేసిన
మహోన్నత వ్యక్తి

జీవితాన్ని "జాతి"కి అంకితమిచ్చిన
అద్భుత వ్యక్తి "అబ్దుల్ కలాం!" విశిష్ట శక్తి

ఓ మహాశయా!
నీ "పుట్టక"కు
పుడమి తల్లి పులకిస్తోంది
జాతి జాతి గర్విస్తోంది
యావత్ ప్రపంచం....
శిరస్సు వంచి నమస్కరిస్తోంది
*(అక్టోబర్ 15 అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా తన స్మృతి పథంలో...)*



–కోడిగూటి తిరుపతి
9573929493

## అదృశ్య గానం

ఎండ కాచినా వెన్నెల కురిసినా
మనసు ఆవరణంలోంచి
వికసిస్తాయి వేల భావనలు
కనిపించని అనుభూతులు
అదృశ్యగానమై స్పర్శిస్తుంటే
మసక మసకగా అజ్ఞాత దృశ్యాలు..

విచ్చుకుపోతున్న పూలరేకుల్లా
ఆలోచనలు రాలిపోతుంటాయి
విప్పారుతున్న వేకువ రెక్కల్లా
ఊహలు ఎగిరిపోతుంటాయి
జీవనాకాశంలో రంగులు మారుతూ
మబ్బులు గుంపులుగా వచ్చిపోతుంటాయి..

జీవించడానికి నిర్వచనాలు వెలిసిపోతూ
అనిర్వచనాలు ఆవహిస్తుంటాయి
పైపైన ఏదో కదిలినట్లు
లోలోంచి ఇంకేదో రగిలినట్లు
విసురుగా తాకి విచ్ఛిన్నం చేస్తూ
విధి విలాసంగా సుడి చుట్టేస్తుంది..

నాలో నేను దాక్కున్నా

గాయాలు తగులుతూనే ఉంటాయి
నా వెతుకులాట గాలాలకు
ఏ ఆకృతీ చిక్కలేదింకా
నన్ను వెంటాడే గేయాలను
రచించి పాడుతున్నదెవరో..

ఎవరితోనూ పోటీపడని ఎదురీతలో
ఓటమి తప్పని చివరి స్థానం నాది
దవడలూ పిడికిళ్ళూ బిగిస్తూ
అపరిపక్వంగా నటనను సాగదీస్తూ
నాకు నేను నిస్సిగ్గుగా లొంగిపోయి
చీకట్లు నింపుకున్న చింపిరి చిత్రంలా..

కాలం కొక్కానికి వేళ్ళాడబడి
తల్లకిందులుగా నమస్కారాసనంలో..



– అనిశెట్టి రజిత
సెల్ : 9849482462

## తెలుగు సినీ సంగీత ప్రపంచంలో
# రాజేశ్వరరావు శైలి ప్రత్యేకం



తెలుగు సినీ సంగీత ప్రపంచంలో రాజేశ్వరావు శైలి ప్రత్యేకమని తెలంగాణ ప్రభుత్వ న్యూఢిల్లీ అధికార ప్రతినిధి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ప్రముఖ సంగీత దర్శకులు డాక్టర్ సాలూరి రాజేశ్వరరావు జయంతి శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆడిటోరియంలో రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రముఖ లలిత సంగీత గాయకులు, స్వరకర్త డాక్టర్ కొమండూరి రామాచారిని ప్రతిష్టాత్మకమైన సాలూరి ప్రతిభా పురస్కారంతో సత్కరించారు. ఈ సందర్భంగా డా॥ వేణుగోపాలాచారి మాట్లాడుతూ విద్యతో పాటు సంగీతం, సాహిత్యం పట్ల పిల్లలకు శిక్షణను ఇప్పించాలన్నారు. ఏపీ మహిళా కమిషన్ పూర్వ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ అర్థవంతమైన భాషతో కూడిన సందేశాత్మకమైన పాటలను సంగీత ప్రియులకు అందించిన రాజేశ్వరరావు పాటలు చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. ఏపీ పూర్వ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, సాలూరి రాజేశ్వరరావు కుమారుడు సాలూరి పూర్ణచందన్‌రావు, రసమయి సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎం.కె.రాము, వ్యాఖ్యాత ఆశాలత పాల్గొన్నారు. రాజేశ్వరరావు సంగీతం స్వరపరిచిన చలన చిత్రాల్లోని ఆణిముత్యాల్లాంటి గీతాలను లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీకి చెందిన గాయనీ గాయకులు ఆలపించి సంగీత ప్రియులకు పంచారు.

## గజల్

మత్లా: శత్రుసేనల మట్టుపెట్టగ కోట ముట్టడి అవసరం
కోట ప్రాంతము చేరనెంచగ తగిన తత్తడి అవసరం
॥శ॥
మండువేసవిలోన మాడుతు నీటి కోసం తపించే
బీటవారిన బీడుకంతయు చినుకు చిత్తడి అవసరం
॥శ॥
పల్లె పల్లెకు వివిధ పంటలు పండవలెనను తలపుతో
నీరు నిలువగ తవ్వి మలచిన చెరువుమత్తడి అవసరం
॥శ॥
నీట మునిగిన మనిషి ఊపిరి పీల్చుకొనగా వెంటనే
బయట పడితే వైద్య పరముగ ఎదకు ఒత్తిడి అవసరం
॥శ॥
సిరులతోడను స్త్రీలు సింగారాల మురియగ నగలతో
పుడమి యందున పులకితమ్మవ మెరుపు పుత్తడి అవసరం
॥శ॥
ప్రా..పంచిక విషయములలో పనికివచ్చే విధముగా
పంచలోహములందు కలుపగ ఇనుము, ఇత్తడి అవసరం
॥శ॥
బంధు, మిత్రుల కోలుపోయిన 'వడ్డెపల్లీ'! బాధగా
కంటినీరును కార్చగానూ గుండెలో తడి అవసరం...
॥శ॥



– డా॥ వడ్డేపల్లి కృష్ణ
9246541699

## నిజాలు!

పార్టీల పొదిలో ఆయుధాలు
ప్రజల బలహీనతలే.,కులం మతం, ప్రాంతం
జనం వైకుంఠపాళీ పావుల
నిచ్చెన లెన్నెక్కినా పడగ నీడలోనే.
పదవీ లాలసే ప్రాథమ్యం
ఉచ్ఛ నీచాల గురించి విచ్చి,ఉచ్చరించాలా.
రాజకీయం, 'చెద'రంగం
బలయ్యేది బంటులూ బలగాలే,ఎట్టైనా.
మన భరత క్షేత్రంలో
కులమొక ..చీడ..మతమొక పీడ.
ప్రేమ ద్వేషం
మనో అయస్కాంతానికి..చెరో ధృవం..!
కవిత కదం తొక్కుతుంది.
ప్రశంస వెన్ను తట్టి నప్పుడల్లా.
ఏం పాపం చేసింది పడక
అనాథ తానైంది..మనిద్దరికీ పడక.
కన్నీరు తుడిచే తలదిండు
నా కున్న ఏకైక ఫ్రెండు.
ఒక్క రోజు జీవించడానికి
రోజు కెన్ని సార్లు మరణించాలో నా దేశంలో
అక్కరే, అవధిలేని స్వేచ్ఛ
స్వీయ నియంత్రణా పరిమితికి లోబడి.
యథాతథ జీవితం
స్వీకరిస్తే మోదం,ఎదిరిస్తే వివాదం.
మంచిచెడ్డలు మిథ్యాపదాలు
దేశకాల పరిస్థితుల ఊసరవెల్లులు.
భయపడుతూ బ్రతకలేం
రసన చంపి,గడ్డీగాదం గతుకలేం
రవి వెలిగేది పగలే..!
కవికి అహరహమూ ప్రభలే..!!



–గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

## ఆకట్టుకున్న 'గుప్పెడంత గుండెలో'




అవయవదానం ఇతివృత్తంగా రూపొందించి ప్రదర్శించిన 'గుప్పెడంత గుండెలో'.. నాటకం ప్రేక్షకులకు చక్కని సామాజిక సందేశాన్ని అందించి మానవత్వాన్ని చిగురించేలా చేసింది. రవీంద్రభారతిలో శుక్రవారం రాత్రి 'సత్కళా భారతి' సంస్థ 29వ వార్షికోత్సవ సందర్భంగా ఈ నాటకాన్ని పలువురు నటీ నటులు ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శిష్టాచంద్రశేఖర్ నాటకీకరణ చేయగా యన్.రవీందర్‌రెడ్డి దర్శకత్వంలో అభినయ ఆర్ట్స్ గుంటూరు వారు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ అవయవ దానం గురించి చైతన్యపరిచేలా నాటకం ప్రదర్శించటం అభినందనీయమన్నారు. ప్రభుత్వ సలహాదారు డా॥కే.వీ.రమణాచారి అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ ఉపకులపతి డా॥ ఎస్.వి సత్యనారాయణ, ప్రముఖ కార్డియాలజిస్టులు డా॥ ఆళ్ల గోపాలకృష్ణ గోఖలే, డా॥ శ్రీనివాసకుమార్, డా॥ డి. సీతారామ్ పాల్గొని నిర్వాహకులతో పాటు నాటక బృందాలను అభినందించారు. సత్కళాభారతి వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ సమన్వయ బాధ్యతలు నిర్వర్తించారు.

## జానపద సాహిత్యానికి చిరునామా "బిరుదురాజు"




జానపద సాహిత్యానికి బిరుదురాజు రామరాజు చిరునామా అని, తెలుగులో జానపద సాహిత్యం గురించి ఏ కాస్త సమాచారం కావాలన్నా, ఠక్కున తోచే పేరు బిరుదురాజు రామరాజు ప్రముఖ సాహితీవేత్త, డాక్టర్ సాగి కమలాకర శర్మ అన్నారు. ప్రతి నెలా రెండో శుక్రవారం తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరిగే నవలా స్రవంతి సాహితీ కార్యక్రమం రవీంద్రభారతిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు డా॥ నందిని సిధారెడ్డి అధ్యక్షత వహించారు. ప్రారంభోపన్యాసం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నర్సింహారెడ్డి చేశారు.

# మానవీయతను చాటే "మణిపూసలు"!

పుస్తక సమీక్ష

"మణిపూసలు" లఘు కవితా రూపం వెలుగులోకి వచ్చిన అనతి కాలంలోనే కవులు దాన్ని ప్రక్రియగా తీర్చి దిద్దడానికి ముందుకు రావడం ముదావహం.. వడిచర్ల సత్యంగారి మానస పుత్రికగా జీవం పోసుకున్న మణిపూసలను కొద్ది నెలల్లోనే అందరు ఆదరించే స్థాయికి ఎదగడం ప్రశంసనీయం!

మణిపూసలులో నాలుగు పాదాలుంటాయి! 1,2,4 పాదాల్లో అంత్యానుప్రాస మరియు 10,11,12 మాత్రల నుండి ఏదైనా ఒక ఒక సంఖ్యనే ఉపయోగించాలి. అనగా ఈ నాలుగు పాదాలలో మాత్రలు సమానంగా ఉండాలి. అయితే.. మూడో పాదానికి అంత్యానుప్రాస నిషేధం.. 10 నుండి 12 మాత్రలుంటే చాలు..

3,4 పాదాల్లో కవితా మెరుపుండాలి అన్న నియమాన్ని వడిచర్ల సత్యంగారు ప్రతిపాదించారు.

ప్రక్రియ ఏదైతేనేం? అందులో కవిత్వాన్ని సృజింప గలిగితే అందరూ అక్కున చేర్చుకుంటారు. కాలానికి ఎదురొడ్డి నిలువగలదు. మణిపూసలు వాట్సప్ సమూహం ద్వారా విస్తృత ప్రచారంలోకి రావడం విశేషం!

తక్కువ కాలంలోనే మణిపూసలు గ్రంథాల రూపంలో రావడం అభినందనీయం! ఈ క్రమంలోనే






సిద్దిపేటకు చెందిన కవి శాడవీరారెడ్డి (యస్వీ రెడ్డి) **"మణిపూసల త్రిశతి"** పేరుతో ఓ పుస్తకాన్ని ప్రకటించారు. 316 మణిపూసలతో ముస్తాబై వచ్చిన ఈ గ్రంథంలో సమాజంలోని సమకాలీన సంఘటనలు.. మానవ సంబంధాలు.. సేవా దృక్పథం.. ప్రకృతి పట్ల ప్రేమ.. నైతికత.. తదితర అంశాలు కవితా వస్తువులైనాయి!

శాడ వీరారెడ్డి తమ తొలి గ్రంథంగా ఈ గ్రంథాన్ని వెలువరించడం ఆనందదాయకం! అలతి అలతి పదాలతో ఆలోచనాత్మక భావాలకు అక్షరాకృతినిస్తూ ఇందలి మణిపూసలకు రూపమిచ్చారు. వివిధ శీర్షికలతో ఖండికలుగా విభజించి.. మణిపూసలను పొందు పరిచారు.

**"సాహితీ ప్రక్రియలలో**
**సరసమైన ఒరవడిలో**
**సృష్టించిన మణిపూసలు**
**భాసిల వలయును భువి"**లో అంటూ వినమ్రంగా ప్రకటించుకున్న కవి వీరారెడ్డి ఈ గ్రంథంలో ఆద్యంతం తమ భావాలకు అక్షర రెక్కలు తొడిగారు. "అమ్మ" శీర్షికన రాయబడిన మణిపూజల్లో.. అమ్మ యొక్క ఔన్నత్యాన్ని చక్కగా ఆవిష్కరించారు.

**"అమ్మంటే సుధ కళశం**
**అమ్మంటే ఆకాశం**
**అమ్మను వర్ణించమంటే**
**సరిపోదే పదకోశం"** అంటూ అమ్మను ఉన్నతంగా చిత్రించారు. **"దోస్తు"** శీర్షికతో రాసిన మణిపూసల్లో చెలిమి బలిమిని తెలియజెప్పారు.

**"కంటికి రెప్పతనే**
**కాలికి చెప్పు తనే**
**దోస్తంటే ఎవరంటే**
**అచ్చు మరో నేనే"** అంటూ దోస్తు గురించి రాసిన తీరు బాగుంది.

**"సారు! స్మరామి"** అంటూ తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య జయశంకర్‌పై మణిపూసలు రాసి మెప్పించారు.

**"నీళ్ళు మావి నిధులు మావి**
**నియామకాలన్ని మావి**
**నిలువు దోపిడేదంటు**
**నినదించిన నిజ దీప్తివి"** అంటూ ఆచార్య జయశంకర్‌గారి పట్ల తమ గౌరవనాన్ని చాటుకున్నారు.

**"పాలమూరు కవనం**
**అందించిన నవకవనం**
**మణిపూసల కీర్తింతును**
**కపిలవాయి గొప్పతనం"** అంటూ కపిలవాయి లింగమూర్తిగారిపై మణిపూసలు రాశారు.

గాంధీజీ, అటల్జీ, కాళోజీ, బతుకమ్మ, "మీ.టూ".. స్త్రీ, ఎన్నికలు, ఓటు, కాళేశ్వరం ప్రాజెక్టు సంఘర్షణ, బదిలీ, వివేకానంద, సుభాష్‌చంద్రబోస్, తదితర అంశాలను కవితా వస్తువులుగా ఎంపిక చేసుకుని కవి వీరారెడ్డి మణిపూసలకు జీవం పోశారు.

'ముక్తకాలు" శీర్షికన రాసిన మణిపూసలలో కవి యొక్క లోక పరిశీలన... సామాజిక చింతన.. కానవస్తాయి! ఇలా ఈ గ్రంథంలో

మణిపూసలు కొలువుదీరాయి! వీటిలో కవిత్వాంశ పెద్దగా లేకపోయినా.. కవి యొక్క సామాజిక దృక్పథాన్ని అభినందిద్దాం..

మున్ముందు పూర్తిస్థాయిలో వచన కవితా సంపుటితో వీరారెడ్డి రావాలని కోరుకుందాం.. ఆ దిశలో ఆయన అడుగులు వేయాలని ఆశిద్దాం..

ప్రతులకు: శాడ వీరారెడ్డి
ఇ.నెం. 18-19-67/2బి/2
కుషాల్‌నగర్ ,
సిద్దిపేట-502 103
సెల్: 99491 50884



– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

## భవిష్య భీతి

మబ్బు మరిగి చినుకయ్యింది
లోహం కరిగి తూటా అయింది
నీలి మేఘం వర్షిస్తే పులకింత
మెషిన్ గన్ గర్జిస్తే జలదరింత
చినుకు నేల తాకితే పరవశం
గుండు గుండెకు తాకితే వివశం
చిరుజల్లుకు తడిసిన మట్టి వాసన
తూటా పోటుకు చిప్పిల్లిక రక్తపు నుడుగు
హరివిల్లులో విరిసిన శైశనగీతి
నిప్పుల కొలిమిలో భవిష్య భీతి
ప్రకృతి ఆస్వాదనతో తడిసిన బాల్యం
జాత్యాహంకార హోరుతో జడిసిన జీవం!!
మళ్ళీ ఎప్పుడా అని చూసే ఆశల కళ్లు
ఇక చాలు భగవంతుడా!!
తుడిచి పెట్టు ఈ కుళ్లు!!



– డా॥ మానస్ కృష్ణకాంత్
94919 28384

# తెలంగాణ భాషది జీవమున్న భాష

## – తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి



కొప్పోలు యాదయ్య రచించిన "పాల జున్ను" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న అతిథులు.

తెలుగు సాహిత్యంలో తెలంగాణ భాష సజీవమైన జీవద్భాష అని తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డాక్టర్ నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. పాలమూరు సాహితి ఆధ్వర్యంలో అక్టోబర్ 10 నాడు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని కాళోజీ హాల్ లో కొప్పోలు యాదయ్య రచించిన "పాల జున్ను" కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా, ఆవిష్కర్తగా విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణభాషలో కవిత్వం రాస్తే అది చిరస్థాయిగా నిలిచిపోతుందని, అందులోని మాధుర్యం అమృతతుల్యమని కొనియాడారు. యాదయ్య రాసిన కవిత్వంలో మానవత్వం కన్పిస్తుందని, ప్రతి మనిషిలో మార్పు తేవడం కవి లక్షణమన్నారు. పాలజున్ను లాంటి కవిత్వాన్ని వెలువరించిన యాదయ్యను ఈ సందర్భంగా ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని కవితలు రాయాలని, సమాజాన్ని మెప్పించే కవిత్వం రాయాలని ఆకాంక్షించారు. విశిష్ట అతిథి, సావరీన్ ఎస్టేట్స్ అండ్ మల్టీట్రేడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బోగ కోదండపాణి మాట్లాడుతూ సమాజం మార్పు కోసం కవులు రాసే ప్రతి కవిత్వానికి తనవంతుగా పూర్తి సహాయ సహకారాలుంటాయన్నారు. మంచి సమాజాన్ని నిర్మించడంలో కవులది విస్మరించని పాత్ర అని కొనియాడారు. పాలమూరు అంటే వలస జిల్లా కాదని, కవుల జిల్లా అని పేర్కొన్నారు. ప్రత్యేక అతిథి, ప్రముఖ న్యాయవాది వి.మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పాలమూరు జిల్లాలో ఉన్న కవులంతా తెలంగాణలో ఏ జిల్లాలో లేరనడం అత్యుక్తి కాదన్నారు.

ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, వనపట్ల సుబ్బయ్య లు మాట్లాడుతూ జున్ను పాలలాంటి కవిత్వాన్ని వెలువరించిన కొప్పోలు యాదయ్యను ఈ సందర్భంగా కొనియాడారు. మరొక ప్రత్యేక అతిథి కందుకూరి శ్రీరాములు మాట్లాడుతూ యాదయ్య కవిత్వం చక్కగా ఉండి పాఠకులను చదివించే గుణముందన్నారు. సభాధ్యక్షులు కోట్ల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ తొలి ప్రయత్నంలోనే యాదయ్య చక్కని కవితా సంపుటిని వెలువరించడం గొప్ప విశేషమన్నారు. పుస్తక సమీక్షను బాదేపల్లి వెంకటయ్య తనదైన శైలిలో చేశారు. ఈ కార్యక్రమంలో సుల్తాన్ పాషా, బోల యాదయ్య, సృజామి, రావూరి వనజ, అంబుజ, ఉప్పరి తిరుమలేష్, సుధాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత

భూమి ఆకాశాలు, సూర్యచంద్రులు,
సప్తసముద్రాలు, పగలురాత్రులు,
పూలు పూదోటలు.....
కావేవి కవితకు అనర్హం.....

భగ్నప్రేమికుల బాధ తలగడ మీద
నీటి చారలుగా, చీకటి గదిలో,
అలసిన మదిలో, దుప్పటి ముసుగుల్లో,
మూసిన రెప్పల్లో, నిట్టూర్పుల్లో.....
దాగిపోకుండా చేసేది కవిత,
గుండెలో గూడుకట్టిన దిగులును కరిగించేది కవిత,
ఏడుపేంటో గుర్తుచేసి...
సరిగా ఏడవటం నేర్పించేది కవిత.

కుళ్ళిన సమాజాన్ని.....
కడిగిన ముత్యం చేయటానికి
కవి అమ్ములపొదిలో నుండి
దూసుకొచ్చిన బాణమే కవిత.,
కులజాడ్యపు వృక్షాన్ని కూకటివేళ్ళతో పెకిలించేది....
మూఢనమ్మకాల మాడు పగలగొట్టేది కవిత,
మనిషి తత్వాన్ని గుర్తు చేసి....
మానవత్వాన్ని కాపాడేదే కవిత.

పెదాల అంచున దాగిన పదాలు....
మది గదిలో ఆగిపోయిన మాటలు,
మబ్బుల్లో నుండి రాలే వర్షపు చినుకుల్లా
కలం నుండి జాలువారే అక్షరాలే కవిత.

సమాజాన్ని సున్నితంగా విమర్శించేది.....
మనసును నిశితంగా గమనించేది....
ప్రకృతి రమణీయతను ఆవిష్కరించేది కవిత.
మండుటెండలో మజ్జిగలా దాహం తీర్చేది
వెలుతురు లేని చోట దీపంలా ప్రకాశించేది
గెలవాలనే కసిని నరనరాన ఎక్కించేది...
చరిత్రను తరతరాలు చెప్పుకునేలా
లిఖించేది కవిత.....



–జాబేర్. పాషా
మస్కట్ (ఒమన్)
0096897663604



అక్టోబర్ 5న కళాలలిత కళావేదికలో సాహితీకిరణం నిర్వహించిన కార్యక్రమంలో విజయపురస్కారాలను అందుకున్న డా॥లలితవాణి, లంక అనూరాధలతో అతిథులు పెద్దూరి వెంకటదాసు, ఆచార్య కొలకలూరి ఇనాక్, గుదిబండి వెంకటరెడ్డి, డా॥పులివర్తి కృష్ణమూర్తి, పొత్తూరి సుబ్బారావు.

## సీఎల్ఎన్ గాంధీ సత్కారం



అవనం ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇది నా ప్రియ వర్తన వేళ శీర్షికన సినీ సంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమంలో విజయతో పాటు చంద్రతేజ, మోహనక్రిష్ణ, సురేందర్, లలిత, రాధిక, రమాదేవి, భారతి, నందగోపాల్, నాగేశ్వరరావు, రామలక్ష్మి, సంధ్యావర్షిణి, బి. పద్మశ్రీలు సినిమాపాటలను ఆలపించారు. డా॥ వకుళాభరణం క్రిష్ణమోహన్‌రావు (తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యుడు), జస్టిస్ బూర్గుల మధుసూదన్, జనార్ధనమూర్తి పాల్గొని గాయనీ గాయకులను అభినందించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌పోర్టు డిపార్ట్‌మెంటు పూర్వ కమిషనర్ సిఎల్ఎన్‌గా గాంధీని ఘనంగా సత్కరించారు.

# టీఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా హుజూర్‌నగర్ ఉప ఎన్నిక

### నేడు ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్న సిఎం కేసీఆర్
### గెలుపోటములపై ఆర్టీసీ సమ్మె ప్రభావం అనివార్యం

నల్లగొండ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): హుజూర్‌నగర్ ఉప ఎన్నిక ఇప్పుడు టిఆర్ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. అందుకే టిఆర్ఎస్ శ్రేణులంతా ఊళ్లల్లో మకాం వేశారు. మందీమార్బలాన్ని దింపారు. ఈ ఎన్నికల్లో గెలిచి తమ పరువు నిలబెట్టుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఉప ఎన్నికలో ఫలితం వ్యతిరేకంగా వస్తే సొంత పార్టీలో విమర్శలు తప్పని పరిస్థితి ఏర్పడింది. అందుకే ఈ ఉప ఎన్నికలో గెలిస్తే ఇక తమకు తిరుగులేదని, ప్రజలు తమవెంటే ఉన్నారని చెప్పుకునే ప్రయత్నాల్లో టిఆర్ఎస్ ఉంది. అయితే ప్రజలు ఎవరికిక ఓటేసినా ఎవరు గెలిచినా అదే గీటురాయి మాత్రంకాదు. సమస్యల పరిష్కారంలో సానుకూల దృక్పథాన్ని ప్రదర్శించే బదులు కఠినంగా, మొండిగా వ్యవహరించాలని నిర్ణయించుకున్నందున కేసీఆర్‌కు రాజకీయంగా నష్టం జరుగుతోంది. ఆర్టీసీ కార్మికుల సమ్మె మొదలై 12రోజులు గడుస్తున్నా పరిష్కారం అయ్యే లక్షణాలు కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనం. హైకోర్టు ఆదేశాలను ప్రభుత్వం ఏ విధంగా ముందుకు తీసుకుని వెళుతుందన్నది కూడా తెలియాల్సి ఉంది. . లోక్‌సభ ఎన్నికలలో బీజేపీ అనూహ్యంగా నాలుగు స్థానాలను, కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాలను కైవసం చేసుకున్నా.. వాస్తవ పరిస్థితులను కేసీఆర్,ఆయన అనుచరగణం గ్రహించడం లేదు. బిజెపి నాలుగు సీట్లు గెల్చుకుంటే పెద్ద ...అంటూ విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై ప్రజలలో ఎంతో కొంత వ్యతిరేకత ఉండటం సహజం. అంతమాత్రాన

అధికారంలో ఉన్నవారు కక్షపూరితంగా వ్యవహరించడాన్ని సమాజం కూడా హర్షించదు. గతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకుల పాత్ర వారి డిమాండ్ల వరకే పరిమితమై ఉండేది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగులను, ఉపాధ్యాయులను ముందుకు నెట్టడంతో నాయకుల ప్రాధాన్యం అమాంతం పెరిగిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులను కేసీఆర్ తోకలతో పోల్చుతున్నారు. అయితే ఉద్యమ సమయంలో వారే ప్రధాన పాత్ర పోషించారని మర్చిపోతే ఎలా? ఇవన్నీ కూడా ఉప ఎన్నికల్లో ప్రభావంచూపే అంశాలే. వీటిని విస్మరించి సాగితే పరిణమాలు కూడా విపరీతంగానే ఉంటాయి. తెలంగాణ తెచ్చిన ఘనతను ఇతరులతో పంచుకోవడం ఇష్టంలేని కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కరి ప్రాధాన్యం తగ్గిస్తూ వచ్చారు. పదవులపై ఆశతో నాటి ఉద్యోగ సంఘాల నాయకులు కూడా సర్దుకుపోయారు. ఈ నేపథ్యంలో రెండో పర్యాయం అధికారంలోకి వచ్చిన కేసీఆర్.. ఉద్యోగులను ఉద్యోగులుగా మాత్రమే చూడాలన్న నిర్ణయానికి వచ్చారు. తమ సమస్యలు చెప్పుకోవడానికి కూడా ఉద్యోగ సంఘాల నాయకులకు అవకాశం ఇవ్వలేదు. ఈ నేపథ్యంలోనే ఆర్టీసీ కార్మికుల సమ్మె మొదలైంది. కార్మికుల డిమాండ్లను రాజకీయ, మానవతా కోణాల్లో పరిశీలించి పరిష్కరించవలసిన ముఖ్యమంత్రి కేసీఆర్.. అధికారులతో కమిటీ ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ఇవన్నీ కూడా ఇప్పుడు హుజూర్ నగర్ ఉప ఎన్నికల ప్రచారాశంగా మారాయి. 17న కెసిఆర్ ఉప ఎన్నికల్లో ప్రచారం చేయనున్నారు. దీనిపై ప్రజలు ఎలా స్పందిస్తారన్నది చూడాలి.

## "బాపూ బాటలో"పుస్తకావిష్కరణ



పూజ్య బాపూజీ,సత్య,అహింసలను ఆయుధాలుగా మలుచుకొని ఆంగ్లేయులను హడలెత్తించిన సత్యాగ్రహి,మహాత్మాగాంధీ 150వ జయంతిని పురస్కరించుకుని ఇరు తెలుగు రాష్ట్రాల కవులనుండి కవితలను ఆహ్వానించి,వాటినన్నింటిని"బాపూ బాటలో"కవితా సంకలనంగా డా వైరాగ్యం ప్రభాకర్ రూపొందించగా,రంగినేని ట్రస్ట్, సిరిసిల్ల వ్యవస్థాపకులు మరియు అధ్యక్షులు రంగినేని మోహన్ రావుగారు ఆదివారంనాడు ఉదయం ఫిలింభవన్లో ఆవిష్కరించారు. ఉదయసాహితి కరీంనగర్ అధ్యక్షులు డా.వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథి,పుస్తక ఆవిష్కర్తగా హాజరైన రంగినేని మోహన్ రావు మాట్లాడుతూ"మహాత్మా గాంధీని మనం మరొకసారి స్మరించుకునేలా గాంధీ వ్యక్తిత్వం,చేసిన ఉద్యమాలు,జీవితం, స్వాతంత్ర్యపోరాటాలపై కవితలనాహ్వానించి 73 కవితలతో పుస్తకాన్ని తీసుకురావడం అభినందనీయ మని" అన్నారు.గాంధీజీ మార్గం ఇప్పటికీ ఆదర్శనీయం ,ఆచరణీయమన్నారు. బాలలను సాహిత్యంవైపు మరల్చేలా కార్యశాలలను నిర్వహించాలన్నారు.విశిష్ట అతిథిగా హాజరైన తెలుగు కార్యక్రమాల అధికారి నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా డా.పత్తిపాక మోహన్ వైరాగ్యం రూపొందించిన బాలల రచనలతో కూడిన"బాల ప్రభలు -4" పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ"నేడు బాలబాలికల దృష్టి రచనావ్యాసంగం వైపు మరలేలా వారిని ప్రోత్సహిస్తూ వారి రచనలతో కూడిన పుస్తకాలను వెలువరించడానికి కవులు ,సాహితీవేత్తలు,సాహితీ సంస్థలు ఉపాధ్యాయులు కృషి చేయవలసిన అవసరముందన్నారు.ఇరు తెలుగు రాష్ట్రాల నుండి కొత్త కొత్త కవులను సాహితీ క్షేత్రానికి పరిచయం చేస్తూ,వారి రచనలను అచ్చురూపంలో చూసుకునే అవకాశం కల్పిస్తున్న డా.వైరాగ్యం ప్రభాకర్ ను మనందరం ప్రోత్సహించాలన్నారు. సభాధ్యక్షులు మాట్లాడుతూ "ఎన్ని తరాలు మారినా గాంధీ మార్గం అనుసరణీయమేనని" తెలిపారు.ఆత్మీయ అతిథులుగా యస్.ఆర్. ఆర్.కళాశాల ప్రిన్సిపాల్ డా.కలువకుంట రామకృష్ణ,తెలుగు పద్య కవితా సదస్సు కరీంనగర్ అధ్యక్షుడు రామక విఠల శర్మ,ప్రముఖ కవి,రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి పాల్గొన్న కార్యక్రమంలో అన్నాడి గజేందర్ రెడ్డి పుస్తకాన్ని సమీక్ష చేశారు. హైదరాబాద్ కు చెందిన కవి సమన్వయశ్రీ డా రవీంద్ర గారి 63వ పుస్తకం "ధనమేధం" లిఖిత వచన కవితల పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇష్రత్ సుల్తానా,నూజెట్టి రవిందర్,పెండోట వెంకటేశ్వర్లు,జక్కు కృష్ణమూర్తి, పున్నంచందర్, జయపాల్ రెడ్డి,కనకం శ్రీనివాస్, అరుణ్,ఎలగొండ రవిస్వామి, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

## అంబల్ల జనార్ధన్‌కు కలాం పురస్కారం


శ్రీ మానస ఆర్ట్ థియేటర్స్ అధ్యక్షుడు కవి రఘుశ్రీ ఆధ్వర్యంలో రచయితలు అంబల్ల జనార్ధన్, డా॥ కేబి గోపాలం, రంగస్థల నటుడు బీఎస్ యాదగిరి, నృత్యకారిణి తన్మయిలకు భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం పేరున పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు దేవులపల్లి ప్రభాకర్‌రావు, కృష్ణ, కళా జనార్ధనమూర్తి, బందారుపల్లి రామచంద్రరావు, డా॥ లలితవాణిలు అతిథులుగా పాల్గొన్నారు.

# తెరాస హామీలు,అవినీతిపైనే అస్త్రాలు

### ఉప ఎన్నికలో వేడి పుట్టిస్తున్న విమర్శలు

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఆర్టీసీ సమ్మెతో ఇప్పుడు విపక్షాలు ఏకమయ్యాయి. లెఫ్ట్,రైట్ అన్న తేడా లేకుండా సంఘీభావం ప్రకటించాయి. అనూహ్యంగా ప్రజలకూడా ఆర్టీసీ కార్మికల వైపే ఉన్నారు. వారి డిమాండ్లను పరిశీలించాలని అంటున్నారు. కానీ విపక్షాలు రాజకీయ లబ్ది కోసం సమ్మెను అడ్డం పెట్టుకున్నాయని అధికార టిఆర్ఎస్ విమర్శిస్తోంది. మొత్తంగా ఇప్పుడు హుజూర్ నగర్ ఉప ఎన్నికలోఅధికార టిఆర్ఎస్ లక్ష్యంగా కాంగ్రెస్, బిజెపి,టిడిపిలు విమర్శలకు పదను పెట్టాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆంధ్రా గుత్తేదార్లకు కట్టు బానిస అని గతకొంతకాలంగా కాంగ్రెస్ విమర్శలను చేస్తోంది. కేసీఆర్ లంచగొండితనం, అవినీతిపై కాంగ్రెస్ ప్రధానంగా ప్రచారం చేస్తోంది. తెరాస పాలనలో పట్టపగలే రాష్ట్ర సంపద దోపిడీకి గురవుతోందని, ఇదంతా కేసీఆర్ కనుసన్నల్లోనే జరుగుతోందని ఆక్షేపించారు. కేశ్వరం, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు సంబంధించి ఏకంగా రూ.77 వేల కోట్ల పనులను ఆ కంపెనీలకే అప్పగించా రని, ఉద్దేశ పూర్వకంగా ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని మూడింతలు పెంచారని విమర్శించారు. ఈ తరహాలో పనులను అప్పగించడం దేశంలో ఎక్కడా చూడలేదని, భవిష్యత్తులోనూ చూడబోమని వ్యాఖ్యా నించారు. గతకొంతకాలంగా మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులపై విమర్శలు చెలరేగుతూనే ఉన్నాయి. ప్రాజెక్టుల వాస్తవ వ్యయం కంటే దాదాపు 30 శాతం అంచనాలు పెంచి ఖర్చు చేశారు. అందులో కేసీఆర్ 6 శాతం కమీషన్ తీసుకోవడంతో పాటు, మంత్రులకు, తన కుటుంబ సభ్యులకు, భజనపరులకు ఎంత శాతం కమిషన్ ఇవ్వాలో కూడా ఆయనే నిర్ణయించారని ఆరోపించారు. రూ.వేల కోట్లు ఖర్చయినా గ్రామాలకు గొట్టాలు వచ్చాయి తప్ప నీళ్లు రాలేదని, ఎకరా భూమికి సాగునీరు పారలేదంటున్నారు. నాలుగేళ్లలో తెలంగాణను నిండా ముంచిన చరిత్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఇకపోతే పిసిస చీఫ్ ఉత్తమ్ ఇదే తరహాలు విమర్శలు చేస్తున్నారు. తెలంగాణ ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేశారని ధ్వజమెత్తారు. అబద్ధాలు, మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన తెరాస ఏ ఒక్క హామీనీ పూర్తిగా నెరవేర్చలేదన్నారు. దళితులు, గిరిజనులకు మూడెకరాల భూమి, ఇళ్లు లేనివారికి రెండు పడకగదుల ఇళ్లు వంటి హామీలేవీ నెరవేరలేదు. అనవసర ఆర్భాటాలతో ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు. ఏ ఆకాంక్షతో రాష్ట్రం సాధించుకున్నామో అందుకు విరుద్ధంగా ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారు. రజాకార్ల రూపంలో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఎంఐఎంతో తెరాస జట్టుకట్టిందని బిజెపి ఎదురుదాడి చేస్తోంది. ఐదేళ్లుగా సచివాలయానికే వెళ్లని ముఖ్యమంత్రి కెసిఆర్ హయాంలో తెలంగాణ అభివృద్ధికి నోచుకోలేదన్నది వారి ప్రధాన ఆరోపణగా ఉంది. మొత్తంగా ఉప ఎన్నికలో ప్రచారం ఊపందుకునే లోగా ఆరోపణలు వేడెక్కాయి.



ఆహ్వానం

తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ
ఎమ్.వి.ఆర్. ఫౌండేషన్
సంయుక్త ఆధ్వర్యంలో
శాంతా-వసంతా ట్రస్ట్ ప్రచురణ
ప్రముఖ రచయిత్రి
డా॥ సి. భవానీదేవి రచన
'తల్లీ నిన్ను తలంచి'
(ముఖాముఖి వ్యాస సంపుటి)
ఆవిష్కరణ సభ
శనివారం, 19-10-2019, ఉదయం 10-30 గంటలకు
రవీంద్రభారతి సమావేశమందిరం (మొదటి అంతస్థు), హైదరాబాద్

ముఖ్యఅతిథి : డా॥ కె.వి. రమణాచారిగారు ఐ.ఎ.ఎస్. (రి)
తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
విశిష్టఅతిథి : 'పద్మభూషణ్' అవార్డు గ్రహీత
డా॥ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డిగారు
శాంతా బయోటెక్నిక్స్ అధినేత
సభాధ్యక్షులు : డా॥ వోలేటి పార్వతీశంగారు
సిఇఓ., జయజయశంకర టి.వి. ఛానల్
గౌరవఅతిథి : శ్రీ మామిడి హరికృష్ణగారు
సంచాలకులు, భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణా రాష్ట్రప్రభుత్వం
ఆత్మీయఅతిథి : శ్రీ సుధామగారు, ప్రముఖ సాహితీవేత్త

సాంస్కృతిక కార్యక్రమం:
'లలితగీత లహరి'
గీత రచన: డా॥ సి. భవానీదేవి, గానం: శ్రీ కడియాల ప్రభాకరరావుగారు

అందరికీ స్వాగతాంజలి
మట్టిగుంట వెంకటరమణ
నిర్వాహకులు, ఎమ్.వి.ఆర్. ఫౌండేషన్
Scanned by CamScanner

## పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తి

ఆదిలాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో ఈ నెలాఖరులోగా పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ అధికారులు తెలిపారు. అన్ని మార్కెట్ యార్డుల్లో రైతుల సౌకర్యా ర్థం ఏర్పాట్లు పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. సీజన్‌లో 24 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు కొనుగోళ్లకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. రైతు పత్తిని అమ్ముకోడానికి మార్కెట్ యార్డుకు వచ్చే ముందు ఇటీవల జారీ చేసిన గుర్తింపు కార్డు, బ్యాంక్ జిరాక్స్ కాపీ వెంట తీసుకరావాలన్నారు. కార్డులేని రైతులు ఆధార్, ఏఈవోల నుంచి ధ్రువీకరణ పత్రాలను తీసుకరావాల్సి ఉంటుందని తెలిపారు. రైతులు తమ పత్తిని ఆరబెట్టుకొని మార్కెట్ యార్డుకు తీసుకరావాలని సూచించారు. తేమ శాతం పై ఇప్పటికే టీవీ స్క్రోలింగ్, కరపత్రాల పంపిణీ, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఉ

### రైతులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

మ్మడి జిల్లా వ్యాప్తంగా కార్యదర్శులందరూ పత్తి కొనుగోళ్ల సమయంలో మార్కెట్ యార్డుల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తాగునీటితో పాటు విశ్రాంతి గదులు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. మార్కెట్‌యార్డుల్లో కాంటాలు, తేమ కొలిచే యంత్రాలు, టార్పాలిన్లను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఆన్‌లైన్ విధానం ద్వారా పంటను కొనుగోలు చేస్తారు. పత్తిని మార్కెట్ యార్డుకు తీసుకొచ్చే రైతు వివరాలు పట్టాపాసు పుస్తకం ఆధారంగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మార్కెట్‌యార్డుల్లో వెబ్‌క్యామ్‌ల ద్వారా చిత్రీకరించడంతో పాటు రైతు వేలిముద్రలు సైతం సేకరిస్తారు. ఫలితంగా పత్తి కొనుగోళ్లు పారదర్శకంగా జరిగే అవకాశాలున్నాయి. మార్కెట్‌యార్డుల్లో ఈ విధానాన్ని అమలు చేయడం ద్వారా దళారులు, మహారాష్ట్రకు చెం దిన రైతుల జిల్లాలో పత్తిని విక్రయించే అవకాశం ఉండదు. పత్తి కొనుగోళ్లకు సంబంధించి కలెక్టర్ ఇప్పటికే అధికారులతో పలు సమావేశాలు నిర్వహించారు. కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా మార్కెటింగ్, వ్యవసాయశాఖ అధికారులకు తగిన సలహాలు, సూచనలు చేశారు. తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించాలని, వారు తీసుకొచ్చిన పత్తి పంట తేమ శాతం రైతుల ముందే పరీక్షించాలని సూచించారు. రైతులు ట్రేడర్స్, దళారులకు పత్తిని అమ్మకుండా సీసీఐకి అమ్మేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా కవితాగానం




హైదరాబాద్, అక్టోబర్ 16, నేటి నిజం: తమ డిమాండ్లు నెరవేర్చుకునేందుకు ఇరవై రోజులుగా ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా కవులు కళం ఝళిపించారు. ఐదేళ్ళుగా వేతనాలు పెంచకుండా మభ్య పెడుతున్న ప్రభుత్వానికి నిరసనగా తమ గళం వినిపించారు. ప్రముఖ సాహితీ సంస్థ 'తెలంగాణ సాహితి' ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ కవులు పాల్గొని, తాము రాసిన కవితలను వినిపించారు.

తెలంగాణ సాహితి హైదరాబాద్ నగర కమిటీ అధ్యక్షులు, చలనం కవితా సంపుటి ఆవిష్కర్త జి.నరేష్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, ఆర్టీసీ కార్మిక సంఘం నాయకులు కె.కె.దివాకరన్ అతిథిగా హాజరయ్యి తాము చేస్తున్న సమ్మెకు అక్షర రూపంలో మద్దతునివ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. తెలంగాణ సాహితి ఉపాధ్యక్షులు తంగిరాల చక్రవర్తి, సామాజిక కార్యకర్త, తెలంగాణ సాహితి ఉపాధ్యక్షులు, మోదుగుపూలు మాస పత్రిక ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ భాషా సారస్వత పరిషత్తు మాజీ ప్రిన్సిపాల్ నరహరి తదితరులు ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ, కార్మికులకు పూర్తి మద్దతును ప్రకటించారు. ప్రముఖ కవయిత్రి, ఇటీవలే జఖ్మీ కవితా సంపుటిని సాహితీ ప్రపంచంలోకి తీసుకువచ్చిన జర్నలిస్టు, రచయిత్రి, తెలంగాణ సాహితి ఉపాధ్యక్షురాలు నస్రీన్ ఖాన్ కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహితి సహాయ కార్యదర్శి సలీమ, నగర కార్యదర్శి డి.సైదులుతోపాటు కవులు మాధవ్(వేమా), రామక కృష్ణమూర్తి, నాంపల్లి సుజాత, శ్రీనిధి(రాలిన చుక్కలు), కె.పి.లక్ష్మీ నరసింహ, రజనీ కులకర్ణి, శాంతి కృష్ణ, గిరిధరుడు, భాస్కర్, నాంపల్లి శ్రీనివాస్, లీలా రెడ్డి, వంశీ కృష్ణ, మూర్తి పరిమి తదితరులు తమ కవితలను వినిపించిన ఈ కార్యక్రమానికి యువకవి ముజాహిద్ అలీ వందన సమర్పణ చేశారు.

## నేటి నిజాలు




OM GANESHAYA NAMAH:
INVITATION
"SUMA SAURABHALU"
INAUGURATION FUNCTION
DATE : 17/10/2019, THURSDAY, 11 A.M.
ON BEHALF OF
MAHARASHTRA TELUGU WRITERS ASSOCIATION
&
KAVANAKIRANALU
WRITER : SHRI. OGANNA DEVANPALLI

PRESIDENT :- SHRI. DAYANAND MAMIDYAL. (FOUNDER, SWARANJALI TELUGU CHANNEL)
CHIEF GUEST :- SHRI. BAISA DEVADAS. (EDITOR, NETI NIJAM)
SPECIAL GUEST :- SHRI. DR. PURANCHANDRA PUNJAL. (EX. MAYOR, SOLAPUR MUNCIPAL CORP.)
BELOVED GUEST :- DR. AJIJ NADAFGI. (POPULAR POET)
DEEPA PRAJWALANAM :- SHRI. RAVINDRA SANGEVENI. (GEN. SECRETARY OF TWAM)
BOOK RELEASE :- SOU. RAVEENA CHAVAN. (PRESIDENT OF TWAM)
BOOK REVIEW :-
SHRI. RAVINDRA SANGEVENI. (GEN. SECRETARY OF TWAM)
SHRI. SHIVA MANCHALA. (PRESIDENT OF KAVANAKIRANALU)
ROLE PLAY :-
SOU. RENUKHA P. BUDHARAM. (POET AND NEWS READER)
WITH BEST COMPLIMENTS :-
SHRI. DEVANPALLI SHIVAKUMAR & FAMILY.
SHRI. SHYAM BHOODATT & FAMILY.
SHRI. AMBADAS VAITALA & FAMILY.
SHRI. AMBADAS TADGOPUL & FAMILY.
SHRI. PARIMELLA SATYANARAYAN & FAMILY.
VENUE : SWARANJALI CHANNEL (E)
NEAR GOVT. POLYTECHNIC COLLEGE, OPP. BURLA SCHOOL, SOLAPUR.



భారతరత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని గానసభలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బీసీ కమీషన్ సభ్యుడు డా॥ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్ధనమూర్తి, కవి రమణ వెలమకన్ని పాల్గొన్నారు.

ప్రేమ ఆహ్వానం సేవ
చిమ్మపూడి ఫౌండేషన్, శ్రీ త్యాగరాయ గానసభల
సంయుక్త ఆధ్వర్యంలో
చిమ్మపూడి ఫౌండేషన్ ప్రారంభోత్సవ సభ
మరియు
'పాట పరిమళించినవేళ' గ్రంథావిష్కరణ
తేది : 20-10-2019 ఆదివారం సా॥ 5-30 గం॥లకు
వేదిక : కళాలలిత కళావేదిక, శ్రీ త్యాగరాయ గానసభ, హైదరాబాదు.
ముఖ్య అతిథి & గ్రంథావిష్కర్త :
డా॥ కె.వి.రమణ గారు (ఐ.ఏ.ఎస్. రిటైర్డ్), తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు
సభాధ్యక్షులు : డా॥ ఏనుగు నరసింహారెడ్డి గారు, ప్రముఖకవి, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ
సభాప్రారంభకులు : డా॥ నందమూరి లక్ష్మీపార్వతి గారు, ఛైర్‌పర్సన్, ఎన్.టి.ఆర్. విజ్ఞాన్ ట్రస్ట్
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్. జనార్దనమూర్తి గారు, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ
గౌరవ అతిథి : శ్రీ హెచ్.వి.ఎల్. ప్రసాదుబాబు గారు, నంది అవార్డు గ్రహీత, ఖమ్మం
గ్రంథసమీక్షకులు : 'లలితసంగీతరత్న' శ్రీ విన్నకోట మురళీకృష్ణ గారు, ప్రముఖ సంగీతదర్శకులు
కార్యక్రమ సమన్వయకర్త : శ్రీ చిమ్మపూడి శ్రీరామమూర్తి గారు, నంది అవార్డు గ్రహీత,
వ్యవస్థాపక అధ్యక్షులు, చిమ్మపూడి ఫౌండేషన్
ప్రార్థన : శ్రీ పానకంటి దక్షిణామూర్తి గారు, ఇటిక్యాల, మంచిర్యాల జిల్లా
కవి సమ్మేళనం : డా॥ తిరునగరి, డా॥ అక్కిరాజు సుందరరామకృష్ణ,
డా॥ చిల్లర భవానీదేవి, డా॥ వై. రామకృష్ణారావు,
శ్రీ మౌనశ్రీ మల్లిక్, శ్రీ వి.వి.సత్యప్రసాద్, శ్రీ రమణ వెలమకన్ని,
శ్రీమతి శైలజామిత్ర, డా॥ రాధశ్రీ, శ్రీ పొత్తూరి సుబ్బారావు,
డా॥ వూసల రజనీ గంగాధర్.
స్మారక పురస్కారాలు : 1. చిమ్మపూడి వెంకటసుబ్బమ్మ స్మారకపురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీమతి సదుల శివమ్మ గారు
2. చిమ్మపూడి వెంకటసుబ్రహ్మణ్యం స్మారకపురస్కారం
పురస్కార గ్రహీత : చి॥ వఝ్ఝుల నాగసాయి అశ్విన్ కుమార్
3. డా॥ కావూరి పాపయ్య శాస్త్రి స్మారకపురస్కారం
పురస్కార గ్రహీత : శ్రీ మెరుగు వెంకటదాసు గారు
చిమ్మపూడి వెంకట సత్యనారాయణ, కార్యదర్శి, చిమ్మపూడి ఫౌండేషన్
కళా శారద, కార్యదర్శి, త్యాగరాయ గాన సభ

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.